

రామావతారంలో వెంకటేశ్వరుడు


వెంకటాద్రిపై అలంకరణ ఇలా...

పెందుర్తి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి వెంకటాద్రి శిఖరంపై కొలువైన వెంకటేశ్వరస్వామిని శనివారం శ్రీరాముని అవతారంలో అలంకరించారు. విల్లంబులు ధరించి కోదండ రాముని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరామ నవమి సందర్భంగా వెంకటేశ్వర స్వామిని శ్రీరామావతారంలో అలంకరించినట్టు ఆలయవర్గాలు తెలిపాయి.

అంబికా బాగ్ ఆలయం ముస్తాబు


శ్రీరామనవమి వేడుకలకు అంబికాబాగ్‌లోని సీతారామ చంద్రస్వామి ఆలయం ముస్తాబైంది. ఆదివారం సీతారాముల కల్యాణం నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శనివారం బీచ్‌రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, తదితరులు -8లో

కార్పొరేటర్ల గొంతెమ్మ కోర్కెలు!

మేయర్‌పై అవిశ్వాసం తీర్మానం నేపథ్యంలో మద్దతు కోసం కూటమి, వైసీపీ యత్నాలు

- ఇదే అదనుగా నేతల ముందు సభ్యుల ఇండెంట్లు
- కుటుంబ సభ్యులతో కలిపి విదేశాలకు తీసుకువెళ్లాలని కొందరి డిమాండ్
- రూ.10 లక్షలు అడుగుతున్న మరికొందరు
- పదవుల కోసం ఇంకొందరి పట్టు...
- తలలు పట్టుకుంటున్న ఇరుపక్షాల నేతలు
- జనసేన 'పశ్చిమ' ఇన్‌చార్జి పదవి బెహరా భాస్కరరావు అడుగుతున్నట్టు ప్రచారం


గొలగాని వెంకట హరికుమారి




పీలా శ్రీనివాసరావు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై కూటమి కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానానికి ప్రతిపాదించడం కొంతమంది కార్పొరేటర్లకు అవకాశంగా మారింది. తమ సభ్యులు వైరిపక్షంలోకి వెళ్లిపోతారేమోనని ఇరుపక్షాలు భయపడుతున్నాయి. ఇదే అవకాశంగా భావిస్తున్న కొందరు కార్పొరేటర్లు...అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా/వ్యతిరేకంగా ఓటు వేస్తే తమకేమి ప్రయోజనం కల్పిస్తారంటూ ఆయా పార్టీల నేతలను అడుగుతున్నారు. ఏమీ చేయలేమని చెబితే ఏమవుతుందోనని భయంతో వారి డిమాండ్లకు కొంతవరకూ తలొగ్గుతున్నట్టు ప్రచారం జరుగుతోంది.

గత ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల తర్వాత జీవీఎంసీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బలం పెరిగింది. ఈ నేపథ్యంలో వైసీపీకి చెందిన మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌కు నోటీస్ ఇచ్చారు. ఈ అంశంపై ఈనెల 19న నిర్వహించే జీవీఎంసీ కౌన్సిల్ ప్రత్యేక సమావేశానికి హాజరుకావాలంటూ కార్పొరేటర్లకు అధికారులు సమాచారం అందజేశారు. 19న జరిగే సమావేశంలో మేయర్‌పై కూటమి కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే 2/3 వంతు సభ్యులు మద్దతు తెలపాల్సి ఉంటుంది. కౌన్సిల్‌లో కార్పొరేటర్లు 97 మందితోపాటు ఓటుహక్కు కలిగిన ఎక్స్ అఫిషియో సభ్యులు (ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు) 14 మంది ఉన్నారు. వీరిలో కనీసం 74 మంది అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తి మద్దతు తెలపాల్సి ఉంటుంది. ఒకవేళ 74 మందికి ఒక్కరు తక్కువైనా సరే అవిశ్వాస తీర్మానం వీగిపోయి తిరిగి హరివెంకటకుమారి మేయర్‌గా కొనసాగుతారు. ప్రస్తుతం కూటమికి కార్పొరేటర్లు, ఎక్స్‌అఫిషియో సభ్యులతో కలిపి 72 మంది సభ్యుల మద్దతు ఉంది. మరో ఇద్దరు సభ్యుల మద్దతు అవసరం. ఇదిలావుండగా కూటమిలో ఉన్న కొంతమంది కార్పొరేటర్లు తమతో టచ్‌లో ఉన్నారని వైసీపీ నేతలు మైండ్‌గేమ్ ఆడుతున్నారు. దీంతో ఎలాగైనా మరో నలుగురు సభ్యుల మద్దతును కూడగట్టుకోవాలని కూటమి నేతలు భావిస్తున్నారు. వైసీపీ నిర్వహిస్తున్న క్యాంపునకు గైర్హాజరైన కార్పొరేటర్లను తమ వైపు తిప్పుకోవడంపై దృష్టిపెట్టారు. ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన ... మిగతా 6వ పేజీలో

పవన్ కల్యాణ్ రాక రేపు



పెందుర్తి ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సోమవారం అల్లూరి జిల్లా అరకు లోయ పర్యటనకు వస్తున్నారని పెందుర్తి శాసనసభ్యుడు పంచకర్ల రమేశ్‌బాబు తెలిపారు. విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి అరకులోయ వెళుతూ ఉదయం 8 గంటలకు పెందుర్తిలో ఆగనున్నారని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు, కూటమి నేతలు తరలివచ్చి ఆయనకు ఘన స్వాగతం పలకాలని పంచకర్ల పిలుపునిచ్చారు.

కంబాలకొండపై కొత్తగా వ్యూపాయింట్


వ్యూపాయింట్ నమూనా ఇది

విశాఖపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కంబాలకొండపై 30 అడుగుల ఎత్తులో వ్యూపాయింట్ నిర్మించనున్నారు. క్యాంటీన్ వెనుక గల కొండపై వ్యూపాయింట్ నిర్మాణానికి రూ.35 లక్షలతో ప్రతిపాదనలు రూపొందించారు. వ్యూపాయింట్ నుంచి తూర్పుగా చూస్తే సముద్రం కనిపిస్తుంది. ఒడిశాలో తీర ప్రాంతంలో కొండలపై రెండు, మూడుచోట్ల నిర్మించిన వ్యూపాయింట్లకు పర్యాటకుల నుంచి మంచి ఆదరణ లభించింది. అక్కడ వ్యూ పాయింట్లు చూసిన అటవీ అధికారులు అదే డిజైన్‌తో కంబాలకొండలో నిర్మించాలని ప్రతిపాదించి ఉన్నతాధికారుల అనుమతి తీసుకున్నారు. కొత్తగా నిర్మించనున్న వ్యూపాయింట్‌కు వెళ్లేందుకు క్యాంటీన్ సమీపం నుంచి రహదారి ఏర్పాటుచేస్తారు. వచ్చే వర్షాకాలం నాటికి వ్యూపాయింట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించామని విశాఖపట్నం రేంజర్ పీవీ శాస్త్రి పేర్కొన్నారు.

కల్యాణం ఆలస్యం



పెరుగుతున్న పెళ్లికాని ప్రసాద్‌లు

30 ఏళ్లు దాటినా వివాహం కాని యువకులు ఎందరో

- ఏళ్ల తరబడి ప్రయత్నాలు చేస్తున్నా కుదరని సంబంధాలు
- ఉద్యోగం, సంపాదన ఉన్నా అమ్మాయి దొరకని పరిస్థితి
- వయసు దాటిపోతుండడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన
- అమ్మాయిలు, వారి కుటుంబ సభ్యుల ఆలోచనల్లో మార్పే కారణం
- ప్రభుత్వ ఉద్యోగులు, భారీ వేతనాలతో కూడిన ప్రైవేటు ఉద్యోగులకు అమ్మాయిలు, వారి కుటుంబ సభ్యుల ప్రాధాన్యం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరానికి చెందిన రాజేశ్ ఎనిమిదేళ్ల కిందట బీఎస్సీ పూర్తిచేశాడు. ప్రముఖ ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. నెలకు రూ.50 వేలకుపైగానే వేతనం వస్తోంది. గత మూడేళ్లుగా తల్లిదండ్రులు పెళ్లి ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటివరకూ సంబంధం కుదరలేదు.

అనకాపల్లి ప్రాంతానికి చెందిన నితిన్ హైదరాబాద్‌లోని ఒక సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. రూ.30 వేల వేతనం. గ్రామంలో ఆస్తులు బాగానే ఉన్నాయి. మూడేళ్లుగా కుటుంబ సభ్యులు సంబంధాలు చూస్తున్నారు. ఇప్పటివరకూ సెట్ కాలేదు. పెళ్లి ప్రయత్నాలు సఫలం కాకపోవడంతో యువకుడు గ్రామానికి రావడానికి కూడా సిగ్గుపడుతున్నాడు. తల్లిదండ్రులకు ఏం చేయాలో కూడా పాలుపోవడం లేదు.



ఆనందపురం ప్రాంతానికి చెందిన యువకుడు ఆరేళ్ల కిందట న్యాయ విద్య పూర్తిచేశాడు. ప్రస్తుతం సొంతంగా ప్రాక్టీస్ చేసుకుంటున్నాడు. మంచి పేరు సంపాదించుకున్నాడు. ఐదేళ్ల నుంచి కుటుంబ సభ్యులు సంబంధాలు చూస్తున్నారు. ఇప్పటికీ కుదరలేదు.

...ఇదీ ప్రస్తుతం అబ్బాయిలు ఎదుర్కొంటున్న పరిస్థితి. ఒకప్పుడు వయసుకు వచ్చిన అమ్మాయి ఇంట్లో ఉంటే ఎంత వేగంగా పెళ్లి చేసి అత్తవారింటికి పంపిద్దామా?...అని తల్లిదండ్రులు ఎదురుచూసేవాళ్లు. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. అబ్బాయిలకు సంబంధాలు దొరకడం కష్టమైపోతోంది. ఒకప్పుడు అబ్బాయి గుణగణాలు, కుటుంబం గురించి తెలుసుకుని పిల్లనిచ్చేవారు. కానీ, ఇప్పుడు అబ్బాయి ఏం చదువుకున్నాడు?, ఏ కంపెనీలో పనిచేస్తున్నాడు?, ఎంత సంపాదిస్తున్నాడు?...అన్న అంశాలను చూస్తున్నారు. దీంతో యువకులకు పెళ్లి కావడం ... మిగతా 6వ పేజీలో

పత్తా లేని పార్లే ఫర్ ది ఓషన్స్ ప్రాజెక్టు

మూడేళ్ల కిందట వైసీపీ ప్రభుత్వం ఒప్పందం

- సముద్ర తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి రీసైక్లింగ్ చేసి షూస్, కళ్లద్దాలు తయారుచేయనున్నట్టు ప్రకటన
- రూ.16 వేల కోట్ల పెట్టుబడి, 20 వేల మందికి ఉద్యోగాలంటూ ప్రభుత్వ పెద్దల హడావుడి
- ఇంతవరకూ అతీగతీలేని వైనం
- ఆ సంస్థకు భూమి కేటాయించకపోవడమే కారణం
- ప్రాజెక్టు లేనట్టేనని చెబుతున్న జీవీఎంసీ అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'సముద్రం, తీరంలో పెరిగిపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తారు. వాటిని రీసైక్లింగ్ చేసి స్పోర్ట్స్ షూస్, టీ షర్టులు, కళ్లద్దాలు తయారుచేస్తారు. విశాఖ కేంద్రంగా రూ.16 వేల కోట్ల పెట్టుబడితో పరిశ్రమను ఏర్పాటుచేస్తారు. 20 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు.' అంటూ గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు గొప్పలు చెప్పారు. అమెరికాకు చెందిన 'పార్లే ఫర్ ది ఓషన్స్' సంస్థతో మూడేళ్ల



పార్లే ఫర్ ది ఓషన్స్ సంస్థతో ఒప్పంద కార్యక్రమంలో నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి

కిందట ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారుచేసినట్టు చెప్పిన కళ్లద్దాలు పెట్టుకుని హడావిడి చేశారు. అయితే దాదాపు మూడేళ్లు గడిచిపోతున్నా ఆ సంస్థ పత్తాలేదు.

సముద్ర తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలు పెరిగిపోతున్నాయి. అలల తాకిడికి లోపలకు వెళ్లే ప్లాస్టిక్ వ్యర్థాలను తినడం వల్ల చేపలతోపాటు ఇతర జీవరాశులు మృత్యువాతపడుతున్నాయి. దీనిపై పర్యావరణవేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు ప్లాస్టిక్ ... మిగతా 6వ పేజీలో

14 అర్ధరాత్రి నుంచి చేపల వేట నిషేధం

- ఈ నెలలోనే మత్స్యకార భరోసా పంపిణీ

విశాఖపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపల వేటపై ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి నుంచి నిషేధం అమలులోకి రానుంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే దీనిపై ఉత్తర్వులు ఇచ్చింది. దాదాపు 61 రోజులు ఈ నిషేధం అమలులో ఉంటుంది. మళ్లీ జూన్ 15వ తేదీ నుంచి మత్స్యకారులను సముద్రంలో వేటకు అనుమతిస్తారు. ఈ నిషేధం సమయంలో బోట్లకు యంత్రాలు లేకుండా తెడ్డసాయంతో చేపలు వేటాడేవారు తప్ప ఇంకెవరూ సముద్రంలోకి వెళ్లకూడదు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వెళ్లడానికి యత్నిస్తే మెరైన్ పోలీసులు చర్యలు చేపడతారు. మత్స్య శాఖ అధికారులు కూడా హార్బర్, జెట్టీలలో నిఘా పెడతారు. ఈ వేసవిలో చేపలు, రొయ్యలు సముద్రంలో తమ సంతతిని వృద్ధి చేస్తాయి. వాటికి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు కేంద్రం ఏటా ఈ నిషేధం అమలు చేస్తోంది.

మత్స్యకారులకు భృతి

మత్స్యకారులకు ఈ నిషేధ కాలంలో రాష్ట్ర ప్రభుత్వం భృతి అందిస్తోంది. గత ఏడాది ఈ సీజన్‌లో ఎన్నికలు జరగడం వల్ల ... మిగతా 6వ పేజీలో

చల్లబడిన నగరం


ఎండ, ఉక్కపోతతో శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి ఉక్కిరిబిక్కిరైన నగరవాసులు మధ్యాహ్నం మూడు గంటల తరువాత వాతావరణం చల్లబడడంతో ఉపశమనం చెందారు. సాయంత్రం ఆరేడు గంటల వరకూ నగరంపై క్యుములోనింబస్ మేఘాలు ఆవరించాయి. కొన్నిచోట్ల చిరుజల్లులు పడ్డాయి. వాతావరణం మారడం, వారాంతం కావడంతో అనేకమంది బీచ్‌కు చేరుకుని సేదతీరారు. - విశాఖపట్నం

గిరినాగుల హల్‌చల్

- తూర్పుకనుమల్లో అధికంగా సంచారం


-8లో

ఉక్కులో విడ్డూరం

- మార్చి 31తో ముగిసిన ఇన్‌చార్జి సీఎండీ పదవీ కాలం
- ఈ నెల 4న ఆస్ట్రేలియా పర్యటనకు పయనం
- డిప్యూటేషన్ పొడిగించకుండానే వెళ్లడంపై ఆశ్చర్యం



- పూర్తి స్థాయి సీఎండీగా ఆరు నెలల క్రితం శక్తిమణి ఎంపిక
- ఇప్పటికీ పోస్టింగ్ ఇవ్వని కేంద్రం
- ఫైనాన్స్ డైరెక్టర్ పోస్టుకు అర్హులే లేరట

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో చిత్ర విచిత్రాలు జరుగుతున్నాయి. సీఎండీ పోస్టు కోసం ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసిన అధికారి శక్తిమణికి ఆరు నెలలైనా పోస్టింగ్ ఇవ్వడం లేదు. కొద్దినెలల కోసం ఇన్‌చార్జి సీఎండీగా తెచ్చిన ఎంఓఐఎల్ సీఎండీ అజయ్ సక్సేనాను గడువు మీరినా ఇంకా కొనసాగిస్తున్నారు. ఆయన పదవీ కాలం ఇక్కడ మార్చి 31తో ముగిసిపోయింది. కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వలేదు. అయినా ఆయన ఇంకా ఇక్కడే ఉన్నారు. పైగా ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లారు. ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకు ఆయన ఆస్ట్రేలియాలో పర్యటించి విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు అవసరమైన ముడిసరకులు కొనుగోలు చేస్తారని సమాచారం. వచ్చే నెలలో మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను ప్రారంభించనున్న నేపథ్యంలో దానికి ... మిగతా 6వ పేజీలో

ఆనందపురం, భీమిలి రోడ్డు విస్తరణ

- రూ. 18 కోట్లతో ప్రతిపాదించిన వీఎంఆర్‌డీఏ
- మొత్తం తొమ్మిది కిలోమీటర్లు
- కిలోమీటరుకు రూ. 2 కోట్లు చొప్పున కేటాయింపు
- 32 ఎకరాల భూ సేకరణ



విస్తరించనున్న ఆనందపురం, భీమిలి రహదారి

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం క్రాస్ రోడ్డు నుంచి భీమిలి వరకు ఉన్న తొమ్మిది కిలోమీటర్ల రహదారిని 60 మీటర్ల మేర విస్తరించనున్నారు. ఈమేరకు రోడ్డుకు ఆనుకుని ఉన్న రైతులకు వీఎంఆర్‌డీఏ అధికారులు ఇటీవల నోటీసులు జారీ చేశారు. విస్తరణ పనుల్లో స్థలాలు కోల్పోనున్న రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రోడ్డు విస్తరణ పనులకు సుమారు రూ.18 కోట్లతో ప్రతిపాదించారు. కిలోమీటరుకు రూ. 2 కోట్లు చొప్పున కేటాయించారు. రోడ్డు విస్తరణ కోసం కొన్నేళ్లుగా స్థానికులు ఎదురుచూస్తున్నారు. ఆనందపురం కూడలి సమీపంలో ఉన్న ఈ క్రాస్ రోడ్డు విస్తరణ జరిగితే భీమిలి నుంచి జాతీయ రహదారిని నేరుగా చేరుకోవడంతో పాటు అనకాపల్లి, తగరపువలస జాతీయ రహదారికి ఎటువంటి అడ్డంకులు లేకుండా చేరుకునే అవకాశం కలుగుతుంది. ఈ సమీపంలోనే భోగాపురం ఎయిర్ పోర్టుకు కొత్త రహదారి నిర్మించడానికి కూడా ప్రతిపాదనలు చేశారు. ఆ రహదారికి కూడా దీన్ని అనుసంధానం చేస్తారని తెలిసింది.

విస్తరణ పనులు ఇలా..

భీమిలి నుంచి క్రాస్ రోడ్డు వరకు తొమ్మిది కిలోమీటర్ల మేర ఈ రహదారి ఉంది. ప్రస్తుతం సింగిల్ రోడ్డుగా పది మీటర్ల వెడల్పుతో ఉంది. దీన్ని 60మీటర్ల మేర విస్తరించడం అంటే అటు ఇటు మరో 170 అడుగుల మేర స్థలాలు సేకరిస్తామని అధికారులు చెప్పారు. రహదారి మధ్యలో ఆనందపురం మండలానికి చెందిన బొడ్డపాలెం, వెల్లంకి, గారిపేట, వేములవలస గ్రామాలకు చెందిన స్థలాలు ఉండగా భీమిలి మండలానికి చెందిన కొత్తవలస, జేవీ అగ్రహారం, తాళ్లవలస గ్రామాలు, జీవీఎంసీకి చెందిన గొల్లలపాలెం, కృష్ణాకాలనీ, సంగివలస, కుమ్మరిపాలెం వంటి ప్రాంతాలు ఉన్నాయి. ఇక్కడ కూడా స్థలాల సేకరణకు అధికారులు నోటీసులు జారీ చేశారు. వేములవలసకు చెందిన 15 సర్వే నంబర్లలలో జిరాయితీ స్థలాలను ఒక సర్వే నంబరు నుంచి ప్రభుత్వ స్థలాన్ని సేకరిస్తున్నారు. వెల్లంకిలో వెల్లంకి, గారిపేట ప్రాంతాలకు చెందిన 221 మంది రైతుల నుంచి భూములను సేకరిస్తున్నారు. ఇందులో 41 సర్వే నంబర్లలో మాత్రం ప్రభుత్వ భూమి ఉంది. మిగిలినదంతా జిరాయితీ భూమి. భీమిలిలో కొత్తవలసలో 12 సర్వే నంబర్లలో స్థలాలను సేకరిస్తున్నారు. ఇందులో మూడు సర్వే నంబర్లలో ప్రభుత్వ భూమి ఉంది. తాళ్లవలసలో 54 సర్వే నంబర్ల నుంచి స్థలాలను సేకరిస్తున్నారు. వీటిలో 12 స్థలాలు ప్రభుత్వానికి చెందినవి. జీవీఎంసీ పరిధిలో సంగివలస ప్రాంతానికి చెందిన 24 సర్వేనంబర్ల నుంచి భూములు సేకరిస్తున్నారు.వీటిలో 7 సర్వే నంబర్లలో మాత్రమే ప్రభుత్వ భూమి ఉంది. కుమ్మరిపాలెం నుంచి 116 సర్వే నంబర్ల నుంచి భూమిని సేకరిస్తున్నారు. ఇందులో 29 సర్వే నంబర్లలలో దేవదాయ శాఖ భూములు ఉన్నాయి. మొత్తంగా రహదారి విస్తరణ కు 32 ఎకరాలు సేకరించడానికి నిర్ణయించారు.భూములు కోల్పోతున్న వారికి నష్ట పరిహారం విషమై ఇంకా స్పష్టత రాలేదు. రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులు కోరారు.



సింహాచలంలో మేఘావృతమైన ఆకాశం

ఊరించి.. ఉసురుమనిపించి..

సింహాచలం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : గత కొద్ది రోజులుగా ఎండల తీవ్రతతో అల్లాడిపోతున్న ప్రజలు శనివారం మధ్యాహ్నం ఆకాశం మేఘావృతం కావడంతో కాస్తా ఉపశమనం పొందారు. ఉదయం నుంచి ఎండ అధికంగా ఉండగా, మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆకాశం ఒక్కసారిగా దట్టమైన మేఘాలతో నిండిపోయి ఉరుములు, మెరుపులు రావడంతో ప్రజలు భారీ వర్షం కురుస్తుందని ఆశపడ్డారు. కానీ కొద్దిసేపటికే మేఘాలు తొలగిపోవడంతో నిరాశ చెందారు.

రగ్బీ జిల్లా జట్ల ఎంపిక రేపు

భీమునిపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఫుట్‌బాల్ మైదానంలో సోమవారం ఉమ్మడి విశాఖ జిల్లా రగ్బీ బాలికలు, బాలుర జట్ల ఎంపిక పోటీలు జరగనున్నాయి.ఈమేరకు జిల్లా రగ్బీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లలిత్‌కుమార్, కిశోర్‌కుమార్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు ఈ జట్ల ఎంపిక జరుగుతుందన్నారు.





స్పీకర్ అయ్యన్న పాత్రుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ఆహ్వాన పత్రికలు అందిస్తున్న ఈఓ సుబ్బారావు, తదితరులు

అప్పన్న వార్షిక కల్యాణోత్సవానికి ఆహ్వానాలు

సింహాచలం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఈనెల 8న జరిగే వార్షిక తిరుకల్యాణ మహోత్సవం, ఈనెల 30న జరిగే చందనోత్సవాలకు రావాలని కోరుతూ దేవస్థానం ఈఓ సుబ్బారావు శనివారం పలువురు ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందించారు. ఈఓ కలిసిన వారిలో స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పీవీజీఆర్ నాయుడు (గణబాబు), టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం ఉన్నారు. ఈఓ, ఇతర అధికారులు ప్రముఖుల నివాసాలకు వెళ్లి ఆహ్వాన పత్రికలు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులకు వేదాశీర్వచనాలను, ప్రసాదాలను అందజేసి శాలువతో సత్కరించారు.

ముత్యాలు కానుక

స్వామివారి వార్షిక తిరుకల్యాణ మహోత్సవంలో వినియోగించాలని కోరుతూ గోపాలపట్నం ప్రాంతానికి చెందిన స్వర్ణా జ్యూవెలరీ అధినేత బాబు, వెంకన్న, సునీల్ బాలజీ కిలో 500 గ్రాముల మంచి ముత్యాలను దేవస్థానం ఈఓ సుబ్బారావుకు అందజేశారు. అధికారులు దాతలకు ఆలయ ఆచారం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు.

అధికారులకు రథ సారథి సూచనలు

స్వామివారి కల్యాణ మహోత్సవంలో రథ సారథి కదిరి లక్ష్మణరావు తన కుమార్తెతో కలిసి శనివారం స్వామివారి రథాన్ని పరిశీలించారు. దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, డీఈఈ నాగేశ్వరరావు, ఏఈ లోకేశ్‌తో రథం స్థితిగతులపై సమగ్రంగా చర్చించారు.బ్రేకులు, స్టీరింగ్ వంటి ముఖ్యమైన భాగాల విషయంలో మరింతగా శ్రద్ధ చూపాలని కొన్ని సూచనలు చేశారు. అలాగే రాజగోపురం ఎదురుగా ప్రధాన మాడ వీధిలో రింగ్‌లు మూసుకుపోయాయని గుర్తించి, వాటిని బయటకు తీసి రథం సులభంగా నడిపేందుకు అనువైన వాతావరణం కల్పించాలని అధికారులను కోరారు.

ఉక్కులో విడ్డూరం

... 5వ పేజీ తరువాయి

సంబంధించిన మెటీరియల్ కొనడానికి ఆయన వెళ్లారని చెబుతున్నారు.

ఇన్‌చార్జి సీఎండీగా ఉన్న ఆయన కొద్దికాలంలో ఇక్కడి నుంచి వెళ్లిపోవలసి ఉంది. అటువంటి వ్యక్తిని విదేశీ పర్యటనకు ఎలా పంపారని ఇక్కడి ఉద్యోగ, కార్మిక వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రస్తుతం కాంట్రాక్టు కార్మికుల తొలగింపు వివాదాస్పదంగా మారింది. దానిపై కార్మిక సంఘాలు నిరవధిక సమ్మెకు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో సీఎండీగా ఇక్కడ ఉండి అన్నీ చూసుకోవలసిన ఆయన విదేశీ పర్యటనకు ఎలా వెళ్లారో అర్థం కావడం లేదనే వాదన వినిపిస్తోంది.

ఫైనాన్స్ డైరెక్టర్ పోస్టుకు అర్హులు లేరట

స్టీల్ ప్లాంటులో ఫైనాన్స్ డైరెక్టర్ పోస్టు ఈ నెలాఖరుకు ఖాళీ అవుతుంది. ఆ స్థానంలో ఉన్న గణేశ్ పదవీ కాలం ఏప్రిల్ 30తో పూర్తవుతుంది. దీని కోసం పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ సెలక్షన్ బోర్డు గతనెల 21న ఇంటర్వ్యూలు నిర్వహించింది. స్టీల్‌ప్లాంటు నుంచి ఐదుగురు, ఇతర సంస్థల నుంచి మరో ఐదుగురు ఇంటర్వ్యూకు హాజరయ్యారు. అయితే వారిలో ఎవరికీ అర్హత లేదని తోసిపుచ్చారు. తగిన అర్హతలు ఉన్నవారినే ఇంటర్వ్యూకు పిలుస్తారు. కానీ బోర్డు వారిలో ఎవరినీ ఎంపిక చేయలేదు. ఉద్దేశపూర్వకంగానే ఆ పోస్టును ఖాళీగా ఉంచుతున్నారని సమాచారం. ఎన్ఎండీసీలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఒక అధికారిణి డిప్యూటేషన్‌పై విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో కొన్ని నెలలుగా పనిచేస్తున్నారు. ఆమె ఫైనాన్స్ డైరెక్టర్‌గా ఎంపిక కావడానికి జూన్ నెలలో అర్హత వస్తుంది. అప్పటివరకూ ఆ పోస్టును ఖాళీగా ఉంచి ఆ తరువాత ఆమెను ఇక్కడే డైరెక్టర్‌గా కొనసాగించాలని ఇదంతా చేస్తున్నారని ప్లాంటులో ఉన్నత స్థాయిలో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న ఫైనాన్స్ డైరెక్టర్ కూడా ఎటువంటి నిర్ణయాలు తీసుకోవడం లేదని, ఆమె చెప్పినట్టే వింటున్నారనేది భోగట్టా. ఈ వ్యవహారాలన్నీ కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ సూచనల మేరకే జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

14 అర్ధరాత్రి నుంచి చేపల వేట నిషేధం

... 5వ పేజీ తరువాయి

గుర్తించిన లబ్ధిదారులకు భృతి అందలేదు. ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు చొప్పున ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుత ప్రభుత్వం గత ఏడాది ఇవ్వాల్సిన రూ.పది వేలు, ఈ ఏడాదికి సంబంధించిన రూ.10 వేలు కలిపి మొత్తం రూ. 20 వేలు ఒక్కో కుటుంబానికి ఇవ్వనున్నట్టు మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు తెలిపారు. గత ఏడాది 9,500 మంది లబ్ధిదారులు ఉన్నారని, వారికి ఈనెలలోనే ఆ మొత్తం ఇచ్చే అవకాశం ఉందన్నారు. ఈఏడాది లబ్ధిదారుల గుర్తింపు ఇంకా చేపట్టాల్సి ఉందన్నారు.



కొమ్మాది : బెటాలియన్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళి



పద్మనాభం ఎంపీడీఓ కార్యాలయం వద్ద వేడుకలు

గొప్ప సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్‌రామ్

జయంతి వేడుకల్లో వక్తలు

పద్మనాభం రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : దేశ మాజీ ఉప ప్రధాని, ప్రముఖ సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి పద్మనాభంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. నాయకులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్, మండల అధ్యక్షురాలు టి.నాగమణి, నాయకులు ఉప్పాడ అప్పారావు, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, ఎం.సోమేశ్వరరావు, ఎం. గౌరీరెడ్డి, కె. సత్యవతి, ఈశ్వరరావు, అచ్చిలనాయుడు పాల్గొన్నారు.

కొమ్మాది : బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం శ్రమించిన గొప్ప వ్యక్తి బాబూ జగ్జీవన్‌రామ్ అని 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ అన్నారు. బక్కన్నపాలెంలో ఉన్న బెటాలియన్‌లో జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్లు పి.సత్యం, మురళీధర్, బి. రామకృష్ణ, టి. శశికాంత్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు. అలాగే రిక్షాకాలనీలో కేవీపీఎస్ ఆధ్వర్యంలోనూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి పి. చిన్నారావు, తదితరులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు డి. అప్పలరాజు, మామిడి శేఖర్, కె. పుష్ప, చంటి, తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని వేములవలసలో జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ లంక కొండమ్మ, ఉత్తరాంధ్ర దళిత నాయకుడు బాగం గోపాలరావు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జగ్జీవన్‌రామ్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణనాయుడు,సియ్యాంద్రి రాంబాబు, ఉప్పాడ సీతారామ్, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం : బాబూ జగ్జీవన్‌రామ్ దళిత సామాజిక వర్గానికి చేసిన సేవలు చిరస్మరణీయమని 98వ వార్డు కార్పొరేటర్ నరసింహం అన్నారు. జగ్జీవన్‌రామ్ 117వ జయంతి పురస్కరించుకుని అంబేడ్కర్ కాలనీలో నవ యువ దళిత సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు కార్యక్రమంలో యువజన సంఘం నేతలు, టీడీపీ నేతలు పంచదార్ల శ్రీనివాస్, బంటుబిల్లి మహేష్, సిరిపురపు సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభం మండల పరిషత్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి ఘనంగా జరిగింది. అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం. విజయకుమార్, ఏఓ జయ ఉమ, ఉద్యోగులు శేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ల గొంతెమ్మ కోర్కెలు!

... 5వ పేజీ తరువాయి

మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కుమార్తె, ఐదో వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంకతోపాటు వైసీపీ నుంచి కార్పొరేటర్లుగా గెలిచిన బెహరా భాస్కరరావు భార్య, కోడలు మద్దతు కోరినట్టు సమాచారం. దీనికి బెహరా భాస్కరరావు కొన్ని డిమాండ్‌లను కూటమి నేతల ముందుపెట్టినట్టు తెలిసింది. తనకు పశ్చిమ నియోజకవర్గ జనసేన సమన్వయకర్త పదవి ఇస్తే తమ కుటుంబ సభ్యులైన ఇద్దరు కార్పొరేటర్ల మద్దతు ఇస్తామని షరతు పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న జనసేన జిల్లా అధ్యక్షుడు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ వచ్చిన తర్వాత దీనిపై స్పష్టత ఇస్తామని కూటమి నేతలు వివరించినట్టు తెలిసింది. అయితే అందుకు జనసేన పార్టీ నేతలు ససేమిరా అంటున్నట్టు ఆ పార్టీ కార్పొరేటర్లు కొందరు చెబుతున్నారు. టీడీపీ నేతకు మేయర్ పదవి దక్కేందుకుగాను వైసీపీ నేతకు తమ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవి ఇవ్వాల్సిన అవసరం లేదని, ఒకవేళ అలా జరగాలంటే తమ పార్టీకి రెండు డిప్యూటీ మేయర్ పదవులను కేటాయించాలని డిమాండ్ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి సీపీఐ కార్పొరేటర్ స్టాలిన్ మద్దతు ఇస్తారని కూటమి నేతలు ఆశాభావంతో ఉన్నారు. మరోవైపు టీడీపీకి చెందిన కార్పొరేటర్లు పదవులు పొందేది కొందరైతే తమకు కలిగే ప్రయోజనం ఏమిటని నిలదీస్తున్నట్టు సమాచారం. కుటుంబ సభ్యులతో తమను విదేశీ పర్యటనకు తీసుకువెళ్లాలని కోరుతున్నట్టు తెలిసింది. ఇదిలావుండగా వైసీపీ క్యాంపులో ఉన్న కార్పొరేటర్లు కూడా ఆ పార్టీ నేతల ముందు రోజుకొక డిమాండ్ పెడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. నాలుగేళ్లపాటు మేయర్, డిప్యూటీ మేయర్లు, ఫ్లోర్‌లీడర్లుగా పదవులు అనుభవించారని, ఎంతో కొంత ఆర్థికంగా బలపడ్డారంటూ పరోక్షంగా తమకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని కొందరు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నట్టు తెలిసింది. నాలుగేళ్లు కేవలం కార్పొరేటర్లుగానే ఉండిపోయామని, ఇప్పుడైనా మేయర్‌పై అవిశ్వాసానికి వ్యతిరేకంగా ఓటు వేసేందుకు వీలుగా తమకు రూ.పది లక్షలు చొప్పున ఇవ్వాలని కోరుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. మరికొందరు తిరిగి తమ వార్డులో తమకే పోటీ చేసేందుకు అవకాశం కల్పిస్తామని హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్టు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇప్పటికే గత 15 రోజులుగా బెంగళూరులో కుటుంబ సభ్యులతోపాటు ఉంచడానికి భారీగా ఖర్చయిందని, మరో 15 రోజులపాటు క్యాంపులో భాగంగా ఇతర రాష్ట్రాల్లో తిప్పాల్సి ఉంది కాబట్టి మరికొంత ఖర్చు అవుతుందని, కాబట్టి అర్థం చేసుకుని పార్టీ నిర్ణయానికి విధేయులుగా ఉండాలని పార్టీ నేతలు హితోపదేశం చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కూటమి నేతలు ఏదైనా ఇస్తే కొందరు కార్పొరేటర్లు వారికి అనుకూలంగా ఓటు వేసే అవకాశం లేకపోలేదని వైసీపీ నేతలు ఆందోళన చెందుతున్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. 2 లక్షల విరాళం

సింహాచలం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి హైదరాబాద్‌కు చెందిన దాత ఎన్. అప్పారావు, విశాఖ నగరానికి చెందిన ఎం. అప్పలరత్నం కుమారులు చెరో రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాలను వారు నగదు రూపంలో దేవస్థానం పర్యవేక్షణాధికారి సి. పద్మనాభరాజు, ఏఈఓ పిళ్లా శ్రీనివాసరావుకు శనివారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం అధికారులు దాతల కుటుంబాలకు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి, శేషవస్త్రాలతో సత్కరించారు.

వైభవంగా నిత్య కల్యాణం

అప్పన్న స్వామికి ఆర్జిత నిత్య కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో పలు స్వర్ణాభరనాలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి, ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు అందజేశారు.

అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



భక్తులతో నిండిన మాడవీధి

సింహాచలం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు శనివారం పెద్ద ఎత్తున తరలివచ్చారు. వేకువజామున కొండ దిగువ తొలిపావంచా వద్ద పుష్కరిణిలో స్నానాలు చేసి, తొలుత భైరవస్వామిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి సింహగిరికి చేరుకుని తలనీలాలు సమర్పించి, తమ ఆరాధ్య దైవం సింహాద్రినాథుడ్ని దర్శించుకున్నారు.

కల్యాణం ఆలస్యం

... 5వ పేజీ తరువాయి

ఒకింత కష్టంగా మారుతోంది. గతంలో 25, 26 ఏళ్లు వచ్చేసరికి అబ్బాయిల్లో దాదాపు 80 శాతం మందికి పెళ్లిళ్లు అయిపోయేవి. కానీ, గడిచిన కొన్నాళ్లుగా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. రెండు, మూడేళ్ల నుంచి సంబంధాలు చూస్తున్నా పెళ్లిళ్లు కావడం లేదు. దీంతో 30 ఏళ్లు దాటిన పెళ్లికాని ప్రసాద్‌ల సంఖ్య పెరిగిపోతోంది. అన్ని సామాజిక వర్గాల్లోనూ ఇదే సమస్య నెలకొంది. అబ్బాయికి పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు ఒక పెద్ద యజ్ఞమే చేయాల్సి వస్తోంది. గతంలో తల్లిదండ్రులు ఏదైనా సంబంధం చూస్తే అమ్మాయిలు మాట్లాడకుండా చేసుకునేవాళ్లు. కానీ, ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదు. అమ్మాయిల ఇష్టాయిష్టాలను కాదనలేని పరిస్థితి. అమ్మాయి ఓకే అంటే తప్ప పెళ్లికి తల్లిదండ్రులు అంగీకరించడం లేదు. జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే విషయంలో అమ్మాయిలు పూర్తి నాలెడ్జ్‌తో ఉంటున్నారు. మంచి వేతనం, సొంత ఇల్లు...వంటివి ఉన్నవారి వైపు మొగ్గు చూపిస్తున్నారు. అటువంటి సంబంధాలను వెతకమని కుటుంబ సభ్యులకు చెబుతున్నారు. విదేశీ సంబంధాలు అయితే మాత్రం అమ్మాయిలు ఒక్క క్షణం కూడా ఆలోచించడం లేదు. వెంటనే ఓకే చెప్పేస్తున్నారు.

ఈ పట్టింపులతో సమస్య

అబ్బాయిల తల్లిదండ్రుల వ్యవహారశైలి కూడా కొంతవరకూ ఈ సమస్యకు కారణమని చెప్పవచ్చు. మంచి కట్నకానుకలు ఆశించడం, అమ్మాయి అందంగా ఉండాలని, అణకువగా ఉండాలని కోరుకుంటూ మొదట్లో వచ్చిన సంబంధాలను కాదనుకుంటున్నారు. ఆ తరువాత వయసు దాటిపోతున్నా అబ్బాయిలకు పెళ్లిళ్లు చేయలేని పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు.

భిన్నమైన పరిస్థితి

గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ప్రభుత్వ ఉద్యోగాలు చేసే అబ్బాయిలను కోరుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగం ఉన్న అబ్బాయితో పెళ్లి చేస్తే అమ్మాయి జీవితాంతం ఇబ్బంది ఉండదన్న భావన తల్లిదండ్రుల్లో ఉంటోంది. ప్రభుత్వ ఉద్యోగం కలిగిన అబ్బాయిలకు వేగంగానే వివాహాలు జరుగుతున్నాయి. అదే పట్టణ ప్రాంతాల్లోని అమ్మాయిలు, వారి తల్లిదండ్రులు ప్రభుత్వ ఉద్యోగులు లేదా సాఫ్ట్‌వేర్ సంబంధాలపై మొగ్గుచూపిస్తున్నారు. విదేశాల్లో ఉన్నారంటే మాత్రం ఎంత కట్నం ఇచ్చేందుకు కూడా అమ్మాయిలు తల్లిదండ్రులు వెనుకాడడం లేదు.

చిరుద్యోగాలు చేసుకునే అబ్బాయిలు, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం చేసుకునేవారికి 35 ఏళ్లు దాటిపోతున్నా సంబంధాలు దొరకడం లేదు. ఈ పరిస్థితి ఉత్తరాంధ్ర మూడు జిల్లాల్లో ఉందంటున్నారు.30 ఏళ్లు దాటి వివాహం కోసం ఎదురుచూసే యువత సంఖ్య అన్ని రంగాల్లోనూ ఉంది. ప్రభుత్వ ఉద్యోగం, సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడిన కొందరు యువకులకు మాత్రమే దీని నుంచి మినహాయింపు లభిస్తోంది.

మానసిక సమస్యలు

పెళ్లికాకపోవడం వల్ల యువకులతో పాటు వారి తల్లిదండ్రులు మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. 30 ఏళ్లు దాటినా పెళ్లి కాకపోవడం వల్ల అబ్బాయిల్లో తీవ్ర అసహనం, నిరుత్సాహం వంటివి పెరిగిపోతున్నట్టు మానసిక వైద్యులు చెబుతున్నారు.

లగ్జరీ లైఫ్ కావాలనుకుంటున్నారు

\- ఎస్.సరోజ, లీగల్ కౌన్సిలర్, డీవీ సెల్



గతంతో పోలిస్తే ఉన్నత చదువులు పూర్తి చేస్తున్న అమ్మాయిల సంఖ్య పెరిగింది. వారు తమ స్థాయికి తగ్గ వారిని కోరుకుంటున్నారు. ఉద్యోగాలు చేసేవారు తమలాగే ఉద్యోగాలు చేసేవారిని ఎంపిక చేసుకుంటున్నారు. అన్నింటికీ మించి లగ్జరీ లైఫ్ కావాలనుకుంటున్నారు. తమ స్నేహితులు, బంధువులను చూసి వారి మాదిరిగా జీవితాన్ని ఉండాలని కోరుకుంటున్నారు. అటువంటి జీవితాన్ని ఇచ్చే స్థాయి ఉన్న అబ్బాయిలు దొరికితేనే పెళ్లికి ఓకే అంటున్నారు. లేకపోతే అంగీకరించడం లేదు. వీటితో పాటు అబ్బాయిల సంఖ్యకు అనుగుణంగా అమ్మాయిల సంఖ్య లేకపోవడం కూడా ఈ సమస్యకు కారణం.

మానసిక ఒత్తిడిలో తల్లిదండ్రులు

\- డాక్టర్ ముత్యాల బాలాజీ, మానసిక నిపుణులు



అబ్బాయికి 30 ఏళ్లు దాటినా పెళ్లికాకపోవడాన్ని వారి తల్లిదండ్రులు నామోషీగా భావిస్తున్నారు. చాలా మంది ఫంక్షన్లకు కూడా దూరంగా ఉంటున్నారు. సమాజంలో ఫ్రీగా ఉండలేకపోతున్నారు. అబ్బాయిల్లో కూడా నిరుత్సాహం, పెళ్లి పట్ల విరక్తి భావం పెరుగుతోంది. కొందరిలో ఆత్మహత్య ఆలోచనలు కూడా పెరుగుతున్నాయి.

ఇటువంటి వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇప్పించడం అత్యంత కీలకం. పెళ్లి అన్న దాన్ని పరువుగా భావించడం వల్లే అబ్బా యిలు, వారి తల్లిదండ్రుల్లో మానసిక సమస్యలు పెరుగుతున్నాయి.

పత్తాలేని పార్లే ఫర్ ది ఓషన్స్ ప్రాజెక్టు

... 5వ పేజీ తరువాయి

వ్యర్థాలతో వివిధ రకాల వస్తువులను తయారుచేసే పరిశ్రమను ఏర్పాటుచేయిస్తున్నట్టు మూడేళ్ల క్రితం నాటి వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. 2022 ఆగస్టు 26న బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో అమెరికాకు చెందిన 'పార్లే ఫర్ ది ఓషన్స్' అనే సంస్థతో ఒప్పందం చేసుకుంది. రూ.16 వేల కోట్ల పెట్టుబడితో 20 వేల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని, అందుకోసం విశాఖ పరిసరాల్లో పరిశ్రమ ఏర్పాటుకు భూమిని కేటాయిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. అదేరోజు భీమిలి నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు తీరం పొడవునా రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, వైసీపీ నేతలు, స్వచ్ఛంద సంస్థలు, నేవీ, స్టీల్‌ప్లాంట్, పోర్టు, కోస్టుగార్డు ఉద్యోగులు సహా 22 వేల మందితో మెగా డ్రైవ్ చేపట్టి 75 టన్నుల వ్యర్థాలను సేకరించారు. పార్లే ఫర్ ది ఓషన్స్ సంస్థ తయారుచేసినట్టు పేర్కొంటూ ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారైన వస్తువులతో బీచ్‌రోడ్డులో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలు, అధికారులు నగరానికి తరలిరావడంతో వారందరికీ వసతి, భోజనం, రవాణా కోసం భారీగా ప్రజాధనం వెచ్చించారు. వేదికపైన జగన్మోహన్‌రెడ్డి ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారుచేసిన కళ్లద్దాలను పెట్టుకుని ఫొటోలకు పోజులిచ్చారు. ప్రభుత్వ పెద్దల హడావిడి చూసి నగరానికి భారీ ప్రాజెక్టు వచ్చిందని, వేలాది మందికి ఉపాధి అవకాశాలు దొరుకుతాయని సంతోషపడ్డారు. ఒప్పంద పత్రాలు మార్చిడి తర్వాత ప్రాజెక్టు గురించి రాష్ట్ర ప్రభుత్వం మరిచిపోయింది. 'పార్లే ఫర్ ది ఓషన్స్' సంస్థ సీఈఓ సెరిల్‌గోచ్ పలుమార్లు అప్పటి ప్రభుత్వ పెద్దలను కలిసి ప్రాజెక్టుకు భూమి కేటాయించాలని కోరారు. వారి నుంచి కూడా ఎలాంటి స్పందన రాలేదు. ఒప్పంద ప్రతాలు మార్చుకుని మూడేళ్లు అవుతున్నాసరే ఆ ప్రాజెక్టు విషయంలో కనీసం ఒక్క అడుగు కూడా పడకపోవడం విశేషం. ప్రాజెక్టు గురించి జీవీఎంసీ అధికారుల వద్ద ప్రస్తావించగా దాదాపు మూడేళ్లవుతున్నా ఎలాంటి పురోగతి లేనందున ఒప్పందం రద్దయినట్టేనని అభిప్రాయపడుతున్నారు.

కనక మహాలక్ష్మి దేవస్థానం ఉద్యోగి హనుమాన్‌శర్మకు నోటీస్

విశాఖపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి దేవస్థానం ఉద్యోగి హనుమాన్‌శర్మకు ఈఓ శోభారాణి శనివారం నోటీస్ జారీ చేశారు. ఆయన 2019 మే నుంచి 2024 జూలై వరకూ డెప్యూటేషన్‌పై శారదాపీఠంలో పనిచేశారు. అయితే శారదా పీఠం దేవదాయ శాఖ పరిధిలో లేనందున డెప్యూటేషన్ చెల్లదని, ఆ కాలానికి తీసుకున్న రూ.37.7 లక్షల జీతభత్యాలను 15 రోజుల్లో దేవస్థానానికి తిరిగి చెల్లించాలని ఈవో ఆదేశించారు.

ఉత్సవాలతో ప్రజల్లో ఐక్యత

భీమునిపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : అమ్మవారి ఉత్సవాల నిర్వహణ వల్ల గ్రామస్థుల్లో ఐక్య తాభావం పెరుగుతుందని టీడీపీ భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు అన్నారు. శని వారం రాత్రి గంట స్తంభం వేదికపై నూకాలమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా భీమిలి సీఐ తిరుమలరావు, ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి, దాతలు కోరాడ రాజబాబు, మణికంఠ స్వీట్స్ అధినేత నాగరాజు తదితరులను కమిటీ సభ్యులు దుశ్శాలువతో సత్కరించి, మెమెంటోలు బహూకరించారు.

8న గీతంలో యోగా మహోత్సవం

సాగర్‌నగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : గీతం యూనివర్సిటీలో ఈనెల 8వ తేదీన కేంద్ర ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉన్న మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా ఆధ్వర్యంలో యోగా మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆయుష్ ప్రాజెక్టు జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె. సునీత తెలిపారు. వంద రోజులు, వంద నగరాలు, వంద సంస్థలు పేరిట కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగా ప్రాజెక్టు ఈ ఏడాది గీతం వర్సిటీకి కేటాయించినట్టు చెప్పారు.

శ్రీరామ నవమికి ఏర్పాట్లు పూర్తి

భీమునిపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సీతారామలక్ష్మణ సహిత శ్రీదాస ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామ నవమి పురస్కరించుకుని ఆదివారం సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ అర్చకుడు వంశీ మోహన చెన్నకృష్ణమాచార్యులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కల్యాణం అనంతరం శ్రీరామ సంకీర్తనం జరుగుతుందన్నారు.

కేంద్ర మంత్రికి స్వాగతం



మంత్రి రామ్మోహన్‌నాయుడుతో మాట్లాడుతున్న ఎయిర్‌పోర్టు అధికారులు

గోపాలపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ నుంచి నగరానికి వచ్చిన కేంద్ర పౌరవిమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు ఎయిర్‌పోర్టులో శనివారం సాదర స్వాగతం లభించింది. ఉదయం 7.30 గంటలకు ఢిల్లీ నుంచి విశాఖ చేరుకున్న ఆయనకు పలువురు నేతలు, విమానాశ్రయ అధికారులు స్వాగతం పలికారు.

జైలు ములాఖత్ హాలులో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న జైలు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు

ఆరిలోవ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : విశాఖ కేంద్రకారాగారం వద్ద గల ములాఖత్ హాలు వద్ద శనివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కేంద్రకారాగారం సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు ప్రారంభించారు. మజ్జిగను పంపిణీ చేశారు. ములాఖత్‌కు వచ్చిన ఖైదీల బంధువులకు వేసవి తాపం నుంచి సేద తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. జైలులో ఉండే ఓపెన్ ఖైదీలు దీన్ని నిర్వహిస్తారని తెలిపారు. వేసవి కాలమంతా నిర్వహించనున్నట్టు చెప్పారు.

ఇంటర్ (ద్వితీయ) తరగతులకు శత శాతం విద్యార్థుల హాజరు

ఆరిలోవ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణాపురంలో గల అంబేడ్కర్ గురుకులం ఇంటర్ ద్వితీయ సంవత్సరం క్లాసులకు పూర్తి స్థాయిలో విద్యార్థులు హాజరవుతున్నారని ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. మొత్తం 38 మంది ద్వితీయ ఇంటర్‌లో విద్యార్థులు ఉన్నారు. వీరిలో బైపీసీ 13 మంది, ఎంపీసీ 25 మంది విద్యార్థులు అని తెలిపారు. వీరంతా క్లాసులకు హాజరవుతున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు.

శ్రీవారి సేవకు షిర్డీ సాయి చారిటబుల్ ట్రస్టు సభ్యులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 05(ఆంధ్రజ్యోతి) :ఈ నెల 8 నుంచి వారం రోజుల పాటు 15 మంది ఎంవీపీ కాలనీకి చెందిన షిర్డీసాయి చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్, టీటీడీ ధార్మిక మండల సభ్యులు పి.సత్యకుమార్ శిష్యులు తిరుమల తిరుపతిలో శ్రీవారి సేవ చేయనున్నారు. ఇప్పటికే శిష్యులు శ్రీనివాసరావు సారథ్యంలో ప్రముఖ దేశాలయాలలో సభ్యులు సేవలు అందించారు. అందులో భాగంగా ఈసారి శ్రీవారి సేవకు వెళ్తున్నట్టు సత్యకుమార్ పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **రాబిన్‌హుడ్** : జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **మ్యాడ్2:** జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **పెళ్ళికాని ప్రసాద్** : శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా :** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 16, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు(నలుపు) 28, బెండకాయలు 32, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 30, బీరకాయలు 44, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 14, క్యారెట్ 30 దొండకాయలు 24, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 30, అల్లం (పాతది)50, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 120, బద్దచిక్కుడు 64, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి)100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 24, క్యాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42 చిలగడదుంపలు 36, కంద 60, దేముడు చిక్కుడు 64, గోరుచిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, క్యరపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	440
విజయనగరం	444
శ్రీకాకుళం	444

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

పూడిక తీశారు.. తరలింపు మరిచారు

- 18వ వార్డులో గెడ్డ పక్కనే చెత్తాచెదారం
- పరిసరాల్లో దుర్గంధం
- అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం



గెడ్డ పొడవునా ఒడ్డున వదిలేసిన పూడిక

ఎంవీపీ కాలనీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలు పరిష్కరించవలసిన అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే ఎలా ఉంటుందో 19వ వార్డులోని గెడ్డలో పూడిక తొలగింపు వ్యవహారం చూస్తే అర్థమవుతోందని అంతా అనుకుంటున్నారు. అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఎంవీపీ కాలనీ పదకొండు, పన్నెండు సెక్టర్ల మధ్య గెడ్డ ప్రవహిస్తోంది. రహదారుల కోసం మధ్యలో వంతెన నిర్మించి ఉంది. బీచ్ రోడ్డుకు సమాంతరంగా మరో వీధి రోడ్డులో వంతెన కింది భాగంలో పూడిక తీయించిన జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు ఆ తొలగించిన భారీగా వచ్చిన పూడకను కుప్పలుగా గెడ్డకు ఒడ్డునే వేసి వదిలేశారు. దీంతో ఈ ప్రాంతమంతా దుర్గంధంగా మారింది. అలా తీసిన పూడిక మళ్లీ గెడ్డలోనే కొంచెం కొంచెంగా పడుతోందని స్థానికులు అంటున్నారు. వర్షం వస్తే ఆ పూడిక అంతా తిరిగి గెడ్డలోనే పడిపోయే పరిస్థితి ఉంది.

పూడిక తరలించాలని ఫిర్యాదు చేస్తున్నా అధికారులు పట్టించుకోడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. గెడ్డలో పూడిక తీయడం అంటే కేవలం అంత వరకే తమ పనిగా అధికారులు భావిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇది బాధ్యతారాహిత్యమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఇదేం విధానమంటూ మండిపడుతున్నారు. ఉన్న సమస్యకు తోడు మరో సమస్య సృష్టిస్తే ఎవరికీ చెప్పుకోవాలని ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఎవరినీ ప్రశ్నించినా ఏ అధికారి నుంచీ సరైన సమాధానం రావడం లేదని అంటున్నారు. ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గెడ్డలో తీసి.. నిర్లక్ష్యంగా వదిలేసిన పూడికను తొలగింపునకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆదర్శప్రాయుడు బాబూ జగ్జీవన్‌రామ్

- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు
- జయంతి సందర్భంగా పలువురి నివాళి



ఎంవీపీ కాలనీ : జగ్జీవన్ రామ్‌కు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



వెంకోజీపాలెం : జగ్జీవన్ రామ్‌కు నివాళులర్పిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్, ఆచార్యులు

ఎంవీపీ కాలనీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : బాబూ జగ్జీవనరామ్ జీవితం అందరికీ ఆదర్శణీయమని తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. బాబూ జగ్జీవనరామ్ 118వ జయంతి సందర్భంగా ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎగ్జీవన్‌రామ్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సామాజిక చైతన్యం కోసం ఆయన ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీకి చెందిన వివిధ వార్డుల నాయకులు మద్దిల రాజశేఖర్, బుగత సత్యనారాయణ, బోర ధనరెడ్డి, అప్పారావు, రవి, అప్పన్న, ముగడ రాజారావు, నారు గోపి, లొడగల వాసు తదితరులు పాల్గొన్నారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర యూనివర్సిటీలో నిర్వహించన కార్యక్రమంలో బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్ పూలమాల వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ అందించిన సేవలు మరువరానివి అన్నారు. రెక్టార్ ఎన్.కిషోర్‌బాబు, వివిధ విభాగాల ప్రిన్సిపాల్స్ జి.శశిభూషణరావు, కె. సీతామాణిక్యం, ఎంవీఆర్ రాజు, జి.గిరిజాశంకర్, ఆర్.పద్మశ్రీ, డి.నగరాజకుమారి, సీడీసీ డీన్ టీవీ కృష్ణ, ఆచార్యులు ప్రేమానందం,అరుణ్‌కుమార్, బసవయ్య, మునిస్వామి, ఎస్సీ, ఎస్టీ అండ్ బీసీ-సీ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ టి.షారోన్‌రాజు, వర్సిటీ ఆచార్యులు, పరిశోధకులు,ఉద్యోగులు,విద్యార్థులుపాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏలో..

సిరిపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన మహోన్నత నేత బాబూ జగజ్జీవన్‌రామ్ అని వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అన్నారు. శనివారం జగజ్జీవన్‌రామ్ 118వ జయంతిని వీఎంఆర్డీఏ కార్యాయలంలోని నిర్వహించారు. ఈ సందర్భంగా జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి కమిషనర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1971 బంగ్లాదేశ్- పాకిస్తాన్ యుద్ధ సమక్షంలో రక్షణ శాఖ మంత్రి ఆయన అందించిన సేవలు ఎంతో గొప్పవమన్నారు. ఆయన అడుగుజాడల్లో మనమంతా నడవాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ హరిప్రసాద్, ఇంజనీర్ భవానీ శంకర్,రామరాజు, డీఎఫ్ఓ సుజాత, శివానీ, పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంలో..

మద్దిలపాలెం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర సమరయోధుడు, బడుగుల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్ రామ్ అని వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో శనివారం జగ్జీవన్‌రాం జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సామాజిక సమానత్వం కోసం ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ అనే సంస్థను స్థాపించడంలో జగ్జీవన్‌రాం కీలకపాత్ర పోషించారన్నారు. సంఘ సంస్కర్తగా, పార్లమెంటులో నలభై ఏళ్లు వివిధ హోదాల్లో మంత్రి పదవులు నిర్వహించడమేకాకుండా ఉప ప్రధానిగా వ్యవహరించారన్నారు. అంతకుముందు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి వైసీపీ నేతలుపూలమాలల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చింతలపూడి వెంకట్రామయ్య, రవిరెడ్డి, బోని శివరామకృష్ణ, జహీర్ అహ్మద్, మొల్లి అప్పారావు, రెయ్యి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంయూ ఆధ్వర్యంలో..

ద్వారకా బస్‌స్టేషన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మద్దిలపాలెం రామ్మోహన్ భవన్‌లో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, కోశాధికారి పీవీవీ మోహన్ పాల్గొని జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారత ఉప ప్రధానిగా, కేంద్రమంత్రిగా జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. విశాఖ రీజియన్‌లోని అన్ని డిపోల ఎన్ఎంయూఏ నాయకులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్‌కు నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్, వైసీపీ నేతలు



జగ్జీవన్‌రామ్‌కు నివాళులు అర్పిస్తున్న ఆర్టీసీ ఎన్ఎంయూఏ నేతలు వై.శ్రీనివాసరావు, మోహన్



బాబూ జగజ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

కేంద్ర కారాగారంలో ఈ-ఆఫీస్ ఓరియంటేషన్ శిక్షణ



శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

ఆరిలోవ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్రకారాగారంలోగల సమావేశ మందిరంలో శనివారం ఈ ఆఫీఎస్ ఓరియెంటేషన్ శిక్షణా తరగతులను కేంద్రకారాగార సిబ్బందికి నిర్వహించారు. ఈ శిక్షణను నగరంలో గల నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసీ) సిబ్బంది పాల్గొని అందించారు. కార్యక్రమంలో మినిస్టీరియల్ సిబ్బందికి అందించినట్టు కేంద్రకారాగారం సూపరిండింట్ ఎం. మహేశ్‌బాబు తెలిపారు.

వృద్ధుడికి ఆశ్రయం



వృద్ధుడితో మాట్లాడుతున్న సీఐ పైడయ్య

మద్దిలపాలెం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : దసపల్లా హిల్స్ జగన్నాథస్వామి ఆలయం వద్ద శనివారం సాయంత్రం అనాథగా సంచరిస్తున్న వృద్ధుడిని త్రీటౌన్ సీఐ పైడయ్య ఆశ్రయం కల్పించారు. భోజనం లేకుండా ఆలయ పరిసరాల్లో తిరుగుతున్న వృద్ధుడిని పెదవాల్తేరు రెడ్‌క్రాస్ సొసైటీలో చేర్పించారు. అనంతరం అతని వివరాల గురించి విచారణ చేసి శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం ఉమ్మలవాడ గ్రామానికి చెందిన శివకోటిరామారావుగా గుర్తించారు. శివకోటిరామారావు బంధువులకు సమాచారమిచ్చి వారు వచ్చేంతవరకు రెడ్‌క్రాస్ సొసైటీలో ఉండేందుకు ఏర్పాట్లు చేశారు.

ప్రజా ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయండి

- సీపీఐ నేతలు కరపత్రాల పంపిణీ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఐ నేతలు షేక్ రెహమాన్ తదితరులు

ఆరిలోవ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : తమ పార్టీ చేపడుతున్న రాజకీయ ప్రచార ఆందోళనలను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం ఆరిలోవ అంబేడ్కర్ జంక్షనులో సీపీఐ నేతలు, కార్యకర్తలు కరపత్రాలను పంపిణీ చేశారు. పలు ప్రజా సమస్యలపై సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 11న సాయంత్రం నాలుగు గంటలకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వ హిస్తున్న ప్రజా ఆందోళన సభకు ప్రజలు అంతా తరలి రావాలని కోరారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్ రెహమాన్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చి సుమారు ఏడాది కావస్తున్నా ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చ లేదని విమర్శించారు. ప్రతి విద్యార్థికి 'తల్లికి వందనం' కింద రూ.15 వేలు ఇస్తామని, రైతులకు ప్రతి ఏటా రూ20 వేలు ఇస్తామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి కింద ప్రతినెలా రూ.1500, నిరుద్యోగ భృతి నెలకు రూ. మూడువేలు ఇస్తామని ఎన్నికలలో హామీలు ఇచ్చి అదికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. దీనిపై ప్రజలను చైతన్యపరచుటకు గొప్ప బహిరంగ సభ ను ఈ నెల 11న నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశానికి సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విచ్చేస్తారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు అత్తిలి విమల, ఎ.దేవుఎడమ్మ, బి.పుష్పలత, ఎ.రవి, సీహెచ్ కాసుబాబు, రమణ, షేక్ హుస్సేన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చడం అవసరం

- శ్రీసంపత్ వినాయగర్ ఆలయ ఈవో శిరీష

సిరిపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : రోజురోజుకూ ఎండ తీవ్రత ఎక్కువవుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చడం ఎంతో అవసరమని శ్రీసంపత్ వినాయగర్ ఆలయ ఈవో కె.శిరీష, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్ పిలుపునిచ్చారు. శనివారం ఆలయ ఆవరణలోని ప్రత్యేకంగా మజ్జిగ, తాగునీరు కేంద్రాన్ని ఆలయ ప్రధాన అర్చకులు పి. మోహన్ పూజలు నిర్వహించి ప్రారంభించారు. భక్తులు, ప్రజలకు ఉచితంగా మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవాలయానికి వచ్చే భక్తులతో పాటు నిత్యం ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు ఉచితంగా మజ్జిగ, తాగునీరు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది డీఎస్ ప్రసాద్, జి.గోవింద్‌రెడ్డి పాల్గొన్నారు.



భక్తులు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు మోహన్, ఈవో శిరీష

ఆర్థిక అంశాలపై ఏయూలో జాతీయ సదస్సు



సదస్సులో పాల్గొన్న తెలంగాణ యూనివర్సిటీ ఆచార్యులు రాంబాబు, ఏయూ ఆచార్యులు

వెంకోజీపాలెం, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి) : ఏయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం, సెంట్రల్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ సంయుక్తంగా "ఫైనాన్షియల్ ఇంక్లూజన్ అండ్ సోషల్ ఈక్విటీ : రోడ్ మ్యాప్ టవర్స్ ఇండియా 2047" పేరిట నిర్వహిస్తున్న జాతీయ సదస్సులో రెండో రోజైన శనివారం'సోషల్ ప్రొటెక్షన్ మెకానిజం అండ్ ఫైనాన్షియల్ ఇంక్లూషన్ అనే అంశంపై పలువురు ఆర్థికనిపుణులు విశ్లేషించారు.

తెలంగాణ యూనివర్సిటీకి చెందిన కామర్స్ విభాగాచార్యులు జి.రాంబాబు 'ఫైనాన్షియల్ లిటరసీ అండ్ కెపాసిటీ బిల్డింగ్‌'పై ప్రసంగించారు. ఫైనాన్షియల్ ఇంక్లూజన్, సోషల్ ఈక్విటీ ఆవశ్యకతను వివరిస్తూ, పూర్తిగా బ్యాంకింగ్ వ్యవస్థతో ముడిపడి ఉందని, చారిత్రాత్మకంగా మొగలాల్ వద్ద నుంచి బ్యాంకింగ్ వ్యవస్థ ఏ విధంగా రూపాంతరం చెందుతూ ఫైనాన్షియల్ సర్వీసెస్‌కు దూరంగా ఉన్నవారిని బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా ఫైనాన్షియల్ సర్వీసులను అందజేసే క్రమాన్ని విశదీకరించారు. బ్యాంకుల జాతీయకరణ.. తరువాత వచ్చినసరళీకరణ, ప్రైవేటీకరణ, అంతర్జాతీయకరణ,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న వివిధ పాలసీలను వివరించారు. 2047లో దేశం అభివృద్ధి చెందాలంటే దేశంలోని ప్రజలందరికీ ఫైనాన్షియల్ సర్వీసెస్ అందుబాటులోకి రావాలన్నారు. అనంతరం ఏయూ స్కూల్ ఆఫ్ డిఫెన్స్ ఎడ్యుకేషన్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.రిషికేశ్వరరావు 'రోల్ ఆఫ్ ప్రైవేట్-పబ్లిక్ పార్ట్నర్‌షిప్ ఇన్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్' అంశంపై విశ్లేషించారు. అనంతరం సమాంతరంగా ఐదు టెక్నికల్ సెషన్లు జరిగాయి. సుమారు 140 పరిశోధన పత్రాలనుసమర్పించి ప్రజెంటేషన్ ఇచ్చారు. చివరిగా ముగింపు సమావేశాన్ని పీటర్ డెక్కర్ స్మార్ట్ సెమినార్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావువ్యవహరించారు. ముఖ్యఅతిథి శామ్యూల్ నాగదేశీ సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ జాలాది రవి, కో-కన్వీనర్ ప్రొఫెసర్ పప్పల సుబ్బారావు, హాజరైన పరిశోధకులకు ప్రశంసాపత్రాలను అందించారు.



సదస్సుకు హాజరైన ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు

కనకమహాలక్ష్మికి ఘనంగా సహస్ర తులసి పూజ



తులసీ మాలలతో అమ్మవారికి అలంకరణ

మహారాణిపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారికి శనివారం సహస్ర తులసి పూజను ఘనంగా నిర్వహించారు. బురుజుపేటలోని అమ్మవారి ఆలయంలో తొలుత అమ్మవారికి పంచామృతాభిషేకం చేసి, అనంతరం సహస్ర తులసి పూజ నిర్వహించారు. ఈ పూజలో ఉభయదాతలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి దేవస్థానం ఉద్యోగి హనుమాన్‌శర్మకు నోటీస్

విశాఖపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి దేవస్థానం ఉద్యోగి హనుమాన్‌శర్మకు ఈఓ శోభారాణి శనివారం నోటీస్ జారీచేశారు. ఆయన 2019 మే నుంచి 2024 జూలై వరకూ డెప్యూటేషన్‌పై శారదాపీఠంలో పనిచేశారు. అయితే శారదా పీఠం దేవదాయ శాఖ పరిధిలో లేనందున డెప్యూటేషన్ చెల్లదని, ఆ కాలానికి తీసుకున్న రూ.37.7 లక్షల జీతభత్యాలను 15 రోజుల్లో దేవస్థానానికి తిరిగి చెల్లించాలని ఈవో ఆదేశించారు.

పదోన్నతులు కోరుతూ ఎమ్మెల్యే పల్లాకు వినతి



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న వార్డు విద్యాకార్యదర్శులు

అల్లిపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని వార్డు సచివాలయ విద్యాకార్యదర్శులు శనివారం గాజువాక శాసనసభ్యుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు విజ్ఞప్తి చేశారు. ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. టెక్నికల్ పోస్టుగా నియమించిన విద్యాకార్యదర్శులను అన్ని ప్రభుత్వ శాఖలలో మెరుగైన మూలవేతనం (బేసిక్ పే)తో పదోన్నతులివ్వాలని, ఇంక్రిమెంట్ బకాయిలు, ఇతర సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లా కిరణ్‌కుమార్, ఎం.శ్రవణ్‌కుమార్, కె.సురేష్ కుమార్, రాజా, బంగారు నాయుడు, హరి, అబ్దుల్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

ఉక్కులో విడ్డూరం

... 5వ పేజీ తరువాయి

సంబంధించిన మెటీరియల్ కొనడానికి ఆయన వెళ్లారని చెబుతున్నారు. ఇన్‌చార్జి సీఎండీగా ఉన్న ఆయన కొద్దికాలంలో ఇక్కడి నుంచి వెళ్లిపోవలసి ఉంది. అటువంటి వ్యక్తిని విదేశీ పర్యటనకు ఎలా పంపారని ఇక్కడి ఉద్యోగ, కార్మిక వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రస్తుతం కాంట్రాక్టు కార్మికుల తొలగింపు వివాదాస్పదంగా మారింది. దానిపై కార్మిక సంఘాలు నిరవధిక సమ్మెకు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో సీఎండీగా ఇక్కడ ఉండి అన్నీ చూసుకోవలసిన ఆయన విదేశీ పర్యటనకు ఎలా వెళ్లారో అర్థం కావడం లేదనే వాదన వినిపిస్తోంది.

ఫైనాన్స్ డైరెక్టర్ పోస్టుకు అర్హులు లేరట

స్టీల్ ప్లాంటులో ఫైనాన్స్ డైరెక్టర్ పోస్టు ఈ నెలాఖరుకు ఖాళీ అవుతుంది. ఆ స్థానంలో ఉన్న గణేశ్ పదవీ కాలం ఏప్రిల్ 30తో పూర్తవుతుంది. దీని కోసం పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ సెలక్షన్ బోర్డు గత నెల 21న ఇంటర్వ్యూలు నిర్వహించింది. స్టీల్ ప్లాంటు నుంచి ఐదుగురు, ఇతర సంస్థల నుంచి మరో ఐదుగురు ఇంటర్వ్యూకు హాజరయ్యారు. అయితే వారిలో ఎవరికీ అర్హత లేదని తేసిపుచ్చారు. తగిన అర్హతలు ఉన్నవారినే ఇంటర్వ్యూకు పిలుస్తారు. కానీ బోర్డు వారిలో ఎవరినీ ఎంపిక చేయలేదు. ఉద్దేశపూర్వకంగానే ఆ పోస్టును ఖాళీగా ఉంచుతున్నారని సమాచారం. ఎన్ఎండీసీలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఒక అధికారిణి డిప్యూటేషన్‌పై విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో కొన్ని నెలలుగా పనిచేస్తున్నారు. ఆమె ఫైనాన్స్ డైరెక్టర్‌గా ఎంపిక కావడానికి జూన్ నెలలో అర్హత వస్తుంది. అప్పటివరకూ ఆ పోస్టును ఖాళీగా ఉంచి ఆ తరువాత ఆమెను ఇక్కడే డైరెక్టర్‌గా కొనసాగించాలని ఇదంతా చేస్తున్నారని ప్లాంటులో ఉన్నత స్థాయిలో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న ఫైనాన్స్ డైరెక్టర్ కూడా ఎటువంటి నిర్ణయాలు తీసుకోవడం లేదని, ఆమె చెప్పినట్టే వింటున్నారనేది భోగట్టా. ఈ వ్యవహారాలన్నీ కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ సూచనల మేరకే జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అణగారినవర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్



టీడీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ తదితరులు



రాజేంద్రనగర్‌లోని జనసేన కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆ పార్టీ నాయకులు

మహారాణిపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దేశానికి మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ చేసిన సేవలు ఆదర్శనీయమని, ఆయన బాటలో అందరూ నడవాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా టీడీపీ కార్యాలయంలో శనివారం జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు బుడుమూరు గోవింద్ ఆధ్వర్యంలో ఆయన జయంతి వేడుకలు నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి గండిబాబ్జీ పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు తోటరత్నం, పి.జయరాజ్, ఎస్.అప్పారావు, అనసూరి మధు, బొడ్డేపల్లి లలిత, ఆదినారాయణ, సనపల కీర్తి, మూల అప్పారావు, గాడి సత్యం, టి.శ్రీనివాసరావు. జి.సత్య, వి.రామ్‌కుమార్, అప్పారావు, జనార్దన్ పాల్గొన్నారు.

డాబాగార్డెన్స్: దళితుల సంక్షేమానికి జగ్జీవన్ రామ్ జీవితాన్ని అంకితం చేశారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కమిటీ ప్రతినిధి సోడాదాసు సుధాకర్ అన్నారు. ఆయన జయంతిని పురస్కరించుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి ఎంతోగానో పాటుపడ్డారన్నారు. ఆయన అడుగుజాడల్లో నడవాలని అన్నారు.



సీతమ్మధారలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఈపీడీసీఎల్ అధికారులు, సిబ్బంది

సీతమ్మధార: అణగారిన వర్గాల అభ్యున్నతికి అవిరళ కృషి చేసిన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో ఆయన విగ్రహానికి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.రామచంద్ర ప్రసాద్, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. చీఫ్ జనరల్ మేనేజర్లు జె.శ్రీనివాసరావు, డి.సుమన్‌కల్యాణి, బి.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

సీతంపేట: రాజేంద్రనగర్‌లోని జనసేన కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సౌత్ పాయింట్ ఆఫ్ కాంట్రాక్ట్ శివ ప్రసాద్ రెడ్డి, 27వ వార్డు జనసేన అధ్యక్షుడు గుండు సురేష్‌బాబు, చంటి, మహిళా కో-ఆర్డినేటర్ అమరాపు దుర్గ, వార్డు అధ్యక్షులు శ్రీనివాస్ పట్నాయక్, పోతు ప్రసాద్, నారా నాగేశ్వరరావు, కోనూరు శ్రీనివాసరావు, సతీష్, లలిత, సుధీర్, వీర మహిళలు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన లేక సామాన్యులకు అన్యాయం



సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

సీతంపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలను పౌరులు తెలుసుకోవాలని మానవ హక్కుల కౌన్సిల్ కార్యదర్శి శ్యామ్‌ప్రసాద్ సూచించారు. రాజ్యాంగం మనకు ప్రసాదించిన సమానత్వపు హక్కును అనుభవిస్తూ, ప్రతి ఒక్కరి హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 'మానవ హక్కులపై అవగాహన, నిర్వర్తించవలసిన బాధ్యతలు' అనే అంశంపై శనివారం సమావేశం నిర్వహించారు. సభాధ్యక్షత వహించిన మానవ హక్కుల కౌన్సిల్ కార్యదర్శి శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ అవగాహన లేకపోవడంతో సామాన్యులు అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. సీనియర్ న్యాయవాది, మానవ హక్కుల కౌన్సిల్ సభ్యుడు ఎన్.వేంకటేశ్వరరావు, మాజీ పోలీసు అధికారి సీహెచ్ సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్‌వీ రమణ, సీనియర్ సభ్యుడు గుండు అప్పలరాజు తదితరులు మానవ హక్కుల కౌన్సిల్ అంకితభావంతో హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు మాజీ పోలీసు అధికారులు, న్యాయవాదులు చాలా సంవత్సరాలుగా లాభాపేక్ష లేకుండా హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్న మానవ హక్కుల కౌన్సిల్‌ను ప్రశంసించారు.

బాలల హక్కుల పరిరక్షణ సీఆర్పీఎఫ్ ధ్యేయం



సమావేశంలో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు

సీతంపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణ ధ్యేయంగా బాలల హక్కుల పరిరక్షణ ఫెడరేషన్ (సీఆర్పీఎఫ్) పనిచేయాలని జిల్లా సెషన్స్ మాజీ న్యాయమూర్తి వి.జయసూర్య సూచించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం నూతన కమిటీ ఏర్పాటైంది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వి.జయసూర్య మాట్లాడుతూ కుల,మత రాజకీయాలకు అతీతంగా నూతన కమిటీ బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. జీవితంలో బాల్యం చాలా విలువైనదని, భవిష్యత్తుకు పునాదులు వేసే ప్రతి అడుగు మొదటి గురువు, అమ్మ తర్వాత బడిలో ఉపాధ్యాయుని పాత్ర ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటుందన్నారు. బాలల హక్కుల కోసం రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను తెలియజేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర బాలల హక్కుల కన్వీనర్ గొర్రిపల్లి దామోదర్, లీగల్ అడ్వైజర్ వి.సతీష్‌లు పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు ఎల్.ప్రజ్ఞాన్ కుమార్, నూతన కమిటీ అధ్యక్షుడు మున్నీర్ బాష, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసమూర్తి, సలహాదారు డాక్టర్ దుప్పలపూడి దీనబంధు, కార్యదర్శి రామలక్ష్మి, అనురాధ, హసన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో ఉల్లాసంగా ఫేర్‌వెల్ వేడుకలు

జ్ఞానాపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ కళాశాలలో శనివారం 67వ స్టూడెంట్ కౌన్సిల్ ఫేర్‌వెల్ వేడుకలు ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కళాశాల పూర్వ విద్యార్థిని, భీమునిపట్నం రెవెన్యూ డివిజన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆలిస్ మనోరంజిని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థినులు విలువలు పాటించాల్సిన ఆవశ్యకత ఉందని ఆమె అన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ముందుకు వెళ్లాల్సిన అవసరాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, నాటికలు, పాటలతో పాటు మిస్ సెయింట్ జోసెఫ్ పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. షైజీ, డా.ఇహరిణి,డా.పి.కె. జయలక్ష్మి, సిస్టర్ హేమ, డా.రమణీలత, ప్రమీల, డా.పవన్, సిస్టర్ దీపాలి, డా.ప్రవీణ్, పావని పాల్గొన్నారు.



మిస్ సెయింట్ జోసెఫ్ పోటీలో పాల్గొన్న విద్యార్థినులతో ప్రిన్సిపాల్ డాక్టర్ షైజీ, ఇతర అధ్యాపకులు

టీ20 క్రికెట్ టోర్నీలో గౌరీ యూత్ గెలుపు

విశాఖపట్నం స్పోర్ట్స్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): యూఏఫ్‌యూ టీ20 టోర్నీలో భాగంగా శనివారం జింక్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో గౌరీ యూత్ సిసి 22 పరుగుల తేడాతో స్టాలియన్ సిసిపై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన గౌరీ యూత్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 127 పరుగులు చేసింది. ఆశిష్ (28), భానుప్రకాష్ (22), సత్యమూర్తి (15), రవితేజ (19 నాటౌట్) రాణించారు. స్టాలియన్స్ బౌలర్ మహేష్ కొహ్లి నాలుగు వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన స్టాలియన్స్ సిసి నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 105 పరుగులు చేసి ఓటమి పాలైంది. అనంత్ (18), నగేష్‌కుమార్ (29) మినహా మిగిలినవారు విఫలమయ్యారు. గౌరీ యూత్ బౌలర్ సత్యమూర్తి నాలుగు వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించి మ్యాన్ ఆఫ్ ద ప్లేయర్‌గా నిలిచాడు.

సామూహిక సీమంతం

మహారాణిపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గం పరిధిలోని 39వ వార్డులో టీడీపీ ఆధ్వర్యంలో మహిళలకు శనివారం సీమంతం నిర్వహించారు. ఐసీడీఎస్, అంగన్‌వాడీ కార్యకర్తల సహకారంతో టీడీపీ సౌత్ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ సుమారు 150 మంది మహిళలకు పోషకాహార కిట్లు, చీరలు, మిఠాయిలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనుసాయి, దానేష్, బలరాం, బషీర్, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో నిత్యం అవస్థలే!

మురళీనగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ బిర్లా జంక్షన్‌లో నిత్యం వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైవే నాలుగు రోడ్ల సిగ్నల్ జంక్షన్ దాటడానికి వాహనదారులకు, పాదచారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. నేషనల్ హైవేలో దూసుకొచ్చే వాహనాలు ఓ వైపు, నాలుగో లైను సర్వీసు దారిలో ఆటోలు అదుపు లేని వేగంతో బెంబేలెత్తిస్తోంటే, రోడ్లను ఆక్రమిస్తున్న కార్ల షోరూంల వాహనాలు, ద్విచక్రవాహనాల షోరూం అమ్మకాలు, రవాణాతో జనానికి దారి దొరకడం లేదు. బిర్లా జంక్షన్ నుంచి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోకి ప్రవేశించే వాహనాల మలుపు వద్ద బజాజ్, కియా, హ్యుందాయ్ షోరూంల వాహనాలు, తయారీ సంస్థల నుంచి ఇక్కడికి నిత్యం వాహనాల్ని చేరవేసే భారీ ట్రాలర్లు రోడ్లను ఆక్రమిస్తున్నాయి. హైవే రోడ్డులోనే ఈ పెద్ద ట్రాలర్లు, గూడ్స్ రవాణా వాహనాలను అడ్డంగా నిలిపేస్తున్నారు. వాహనాలను దిగుమతి చేసుకోవడం, అమ్మకాలు జరపడం కోసం రోడ్లనే అత్యధికంగా వినియోగిస్తున్నారు. బజాజ్ డీలర్ షిప్ ఉన్న ఓ షోరూం ఏకంగా గ్రీన్ బెల్ట్ నిబంధనల్ని తుంగలో తొక్కేసి షోరూం రోడ్డు వరకు విస్తరించింది. పెద్దల అండతో నడుస్తున్న ఈ వ్యాపారాల్ని అక్కడే ఉండే ట్రాఫిక్ అవుట్ పోస్ట్ విభాగాల కానిస్టేబుల్స్ అడ్డగించే సాహసం చేయరు. దీంతో సగటు వాహనదారులు ప్రమాదాల బారిన పడినా, ప్రాణాలే వదిలేసినా వారి స్వీయ తప్పిదంగానే సర్దుకుపోవాల్సిన పరిస్థితి నెలకొంది.



బిర్లా జంక్షన్ రోడ్డులో నిత్యం ఇదే ట్రాఫిక్ తంతు

కల్యాణం ఆలస్యం

... 5వ పేజీ తరువాయి

ఒకింత కష్టంగా మారుతోంది. గతంలో 25, 26 ఏళ్లు వచ్చేసరికి అబ్బాయిల్లో దాదాపు 80 శాతం మందికి పెళ్లిళ్లు అయిపోయేవి. కానీ, గడిచిన కొన్నాళ్లుగా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. రెండు, మూడేళ్ల నుంచి సంబంధాలు చూస్తున్నా పెళ్లిళ్లు కావడం లేదు. దీంతో 30 ఏళ్లు దాటిన పెళ్లికాని ప్రసాద్‌ల సంఖ్య పెరిగిపోతోంది. అన్ని సామాజిక వర్గాల్లోనూ ఇదే సమస్య నెలకొంది. అబ్బాయికి పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు ఒక పెద్ద యజ్ఞమే చేయాల్సి వస్తోంది.

గతంలో తల్లిదండ్రులు ఏదైనా సంబంధం చూస్తే అమ్మాయిలు మాట్లాడకుండా చేసుకునేవాళ్లు. కానీ, ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదు. అమ్మాయిల ఇష్టాయిష్టాలను కాదనలేని పరిస్థితి. అమ్మాయి ఓకే అంటే తప్ప పెళ్లికి తల్లిదండ్రులు అంగీకరించడం లేదు. జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే విషయంలో అమ్మాయిలు పూర్తి నాలెడ్జ్‌తో ఉంటున్నారు. మంచి వేతనం, సొంత ఇల్లు...వంటివి ఉన్నవారి వైపు మొగ్గు చూపిస్తున్నారు. అటువంటి సంబంధాలను వెతకమని కుటుంబ సభ్యులకు చెబుతున్నారు. విదేశీ సంబంధాలు అయితే మాత్రం అమ్మాయిలు ఒక్క క్షణం కూడా ఆలోచించడం లేదు. వెంటనే ఓకే చెప్పేస్తున్నారు.

ఈ పట్టింపులతో సమస్య

అబ్బాయిల తల్లిదండ్రుల వ్యవహారశైలి కూడా కొంతవరకూ ఈ సమస్యకు కారణమని చెప్పవచ్చు. మంచి కట్నకానుకలు ఆశించడం, అమ్మాయి అందంగా ఉండాలని, అణకువగా ఉండాలని కోరుకుంటూ మొదట్లో వచ్చిన సంబంధాలను కాదనుకుంటున్నారు. ఆ తరువాత వయసు దాటిపోతున్నా అబ్బాయిలకు పెళ్లిళ్లు చేయలేని పరిస్థితి నెలకొంటోందని చెబుతున్నారు.

భిన్నమైన పరిస్థితి

గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ప్రభుత్వ ఉద్యోగాలు చేసే అబ్బాయిలను కోరుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగం ఉన్న అబ్బాయితో పెళ్లి చేస్తే అమ్మాయి జీవితాంతం ఇబ్బంది ఉండదన్న భావన తల్లిదండ్రుల్లో ఉంటోంది. ప్రభుత్వ ఉద్యోగం కలిగిన అబ్బాయిలకు వేగంగానే వివాహాలు జరుగుతున్నాయి. అదే పట్టణ ప్రాంతాల్లోని అమ్మాయిలు, వారి తల్లిదండ్రులు ప్రభుత్వ ఉద్యోగులు లేదా సాఫ్ట్‌వేర్ సంబంధాలపై మొగ్గుచూపిస్తున్నారు. విదేశాల్లో ఉన్నారంటే మాత్రం ఎంత కట్నం ఇచ్చేందుకు కూడా అమ్మాయిలు తల్లిదండ్రులు వెనుకాడడం లేదు.

చిరుద్యోగాలు చేసుకునే అబ్బాయిలు, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం చేసుకునేవారికి 35 ఏళ్లు దాటిపోతున్నా సంబంధాలు దొరకడం లేదు. ఈ పరిస్థితి ఉత్తరాంధ్ర మూడు జిల్లాల్లో ఉందంటున్నారు. 30 ఏళ్లు దాటి వివాహం కోసం ఎదురుచూసే యువత సంఖ్య అన్ని రంగాల్లోనూ ఉంది. ప్రభుత్వ ఉద్యోగం, సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడిన కొందరు యువకులకు మాత్రమే దీని నుంచి మినహాయింపు లభిస్తోంది.

మానసిక సమస్యలు

పెళ్లికాకపోవడం వల్ల యువకులతోపాటు వారి తల్లిదండ్రులు మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. 30 ఏళ్లు దాటినా పెళ్లి కాకపోవడం వల్ల అబ్బాయిల్లో తీవ్ర అసహనం, నిరుత్సాహం వంటివి పెరిగిపోతున్నట్టు మానసిక వైద్యులు చెబుతున్నారు.

లగ్జరీ లైఫ్ కావాలనుకుంటున్నారు



గతంతో పోలిస్తే ఉన్నత చదువులు పూర్తిచేస్తున్న అమ్మాయిల సంఖ్య పెరిగింది. వారు తమ స్థాయికి తగ్గ వారిని కోరుకుంటున్నారు. ఉద్యోగాలు చేసేవారు తమలాగే ఉద్యోగాలు చేసేవారిని ఎంపిక చేసుకుంటున్నారు. అన్నింటికీ మించి లగ్జరీ లైఫ్ కావాలనుకుంటున్నారు. తమ స్నేహితులు, బంధువులను చూసి వారి మాదిరిగా జీవితాన్ని ఉండాలని కోరుకుంటున్నారు. అటువంటి జీవితాన్ని ఇచ్చే స్థాయి ఉన్న అబ్బాయిలు దొరికితేనే పెళ్లికి ఓకే అంటున్నారు. లేకపోతే అంగీకరించడం లేదు. వీటితోపాటు అబ్బాయిల సంఖ్యకు అనుగుణంగా అమ్మాయిల సంఖ్య లేకపోవడం కూడా ఈ సమస్యకు కారణం. - ఎస్.సరోజ, లీగల్ కౌన్సిలర్, డీవీ సెల్

మానసిక ఒత్తిడిలో తల్లిదండ్రులు



అబ్బాయికి 30 ఏళ్లు దాటినా పెళ్లికాకపోవడాన్ని వారి తల్లిదండ్రులు నామోషీగా భావిస్తున్నారు. చాలామంది ఫంక్షన్లకు కూడా దూరంగా ఉంటున్నారు. సమాజంలో ఫ్రీగా ఉండలేకపోతున్నారు. అబ్బాయిల్లో కూడా నిరుత్సాహం, పెళ్లి పట్ల విరక్తి భావం పెరుగుతోంది. కొందరిలో ఆత్మహత్య ఆలోచనలు కూడా పెరుగుతున్నాయి. ఇటువంటి వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇప్పించడం అత్యంత కీలకం. పెళ్లి అన్న దాన్ని పరువుగా భావించడం వల్లే అబ్బాయిలు, వారి తల్లిదండ్రుల్లో మానసిక సమస్యలు పెరుగుతున్నాయి. -డాక్టర్ ముత్యాల బాలాజీ, మానసిక నిపుణులు

కార్పొరేటర్ల గొంతెమ్మ కోర్కెలు!

... 5వ పేజీ తరువాయి

మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కుమార్తె, ఐదో వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంకతోపాటు వైసీపీ నుంచి కార్పొరేటర్లుగా గెలిచిన బెహరా భాస్కరరావు భార్య, కోడలు మద్దతు కోరినట్టు సమాచారం. దీనికి బెహరా భాస్కరరావు కొన్ని డిమాండ్‌లను కూటమి నేతల ముందుపెట్టినట్టు తెలిసింది. తనకు పశ్చిమ నియోజకవర్గ జనసేన సమన్వయకర్త పదవి ఇస్తే తమ కుటుంబ సభ్యులైన ఇద్దరు కార్పొరేటర్ల మద్దతు ఇస్తామని షరతు పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న జనసేన జిల్లా అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ వచ్చిన తర్వాత దీనిపై స్పష్టత ఇస్తామని కూటమి నేతలు వివరించినట్టు తెలిసింది. అయితే అందుకు జనసేన పార్టీ నేతలు ససేమిరా అంటున్నట్టు ఆ పార్టీ కార్పొరేటర్లు కొందరు చెబుతున్నారు. టీడీపీ నేతకు మేయర్ పదవి దక్కేందుకుగాను వైసీపీ నేతకు తమ పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జి పదవి ఇవ్వాల్సిన అవసరం లేదని, ఒకవేళ అలా జరగాలంటే తమ పార్టీకి రెండు డిప్యూటీ మేయర్ పదవులను కేటాయించాలని డిమాండ్ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి సీపీఐ కార్పొరేటర్ స్టాలిన్ మద్దతు ఇస్తారని కూటమి నేతలు ఆశాభావంతో ఉన్నారు. మరోవైపు టీడీపీకి చెందిన కార్పొరేటర్లు పదవులు పొందేది కొందరైతే తమకు కలిగే ప్రయోజనం ఏమిటని నిలదీస్తున్నట్టు సమాచారం. కుటుంబ సభ్యులతో తమను విదేశీ పర్యటనకు తీసుకువెళ్లాలని కోరుతున్నట్టు తెలిసింది. వైసీపీ క్యాంపులో ఉన్న కార్పొరేటర్లు కూడా ఆ పార్టీ నేతల ముందు రోజుకొక డిమాండ్ పెడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. నాలుగేళ్లపాటు మేయర్, డిప్యూటీ మేయర్లు, ఫ్లోర్‌లీడర్లుగా పదవులు అనుభవించారని, ఎంతో కొంత ఆర్థికంగా బలపడ్డారంటూ పరోక్షంగా తమకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని కొందరు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నట్టు తెలిసింది. నాలుగేళ్లు కేవలం కార్పొరేటర్లుగానే ఉండిపోయామని, ఇప్పుడైనా మేయర్‌పై అవిశ్వాసానికి వ్యతిరేకంగా ఓటు వేసేందుకు వీలుగా తమకు రూ.పది లక్షలు చొప్పున ఇవ్వాలని కోరుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. మరికొందరు తిరిగి వార్డులో తమకే పోటీ చేసేందుకు అవకాశం కల్పిస్తామని హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్టు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇప్పటికే గత 15 రోజులుగా బెంగళూరులో కుటుంబ సభ్యులతోపాటు ఉంచడానికి భారీగా ఖర్చయిందని, మరో 15 రోజులు క్యాంపులో భాగంగా ఇతర రాష్ట్రాల్లో తిప్పాల్సి ఉంది కాబట్టి మరికొంత ఖర్చు అవుతుందని, కాబట్టి అర్థం చేసుకుని పార్టీ నిర్ణయానికి విధేయులుగా ఉండాలని పార్టీ నేతలు హితోపదేశం చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కూటమి నేతలు ఏదైనా ఇస్తే కొందరు కార్పొరేటర్లు వారికి అనుకూలంగా ఓటు వేసే అవకాశం లేకపోలేదని వైసీపీ నేతలు ఆందోళన చెందుతున్నారు.

14 అర్ధరాత్రి నుంచి చేపల వేట నిషేధం

... 5వ పేజీ తరువాయి

గుర్తించిన లబ్ధిదారులకు భృతి అందలేదు. ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు చొప్పున ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుత ప్రభుత్వం నిరుడు ఇవ్వాల్సిన రూ.పది వేలు, ఈ ఏడాది రూ.10 వేలు కలిపి మొత్తం రూ.20 వేలు ఒక్కో కుటుంబానికి ఇవ్వనున్నట్టు మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు తెలిపారు. గత ఏడాది 9,500 మంది లబ్ధిదారులు ఉన్నారని, వారికి ఈ నెలలోనే ఆ మొత్తం ఇచ్చే అవకాశం ఉందన్నారు. ఈ ఏడాది లబ్ధిదారుల గుర్తింపు ఇంకా చేపట్టాల్సి ఉందని వివరించారు.

పత్తాలేని పార్లే ఫర్ ది ఓషన్స్ ప్రాజెక్టు

... 5వ పేజీ తరువాయి

వ్యర్థాలతో వివిధ రకాల వస్తువులను తయారుచేసే పరిశ్రమను ఏర్పాటుచేయిస్తున్నట్టు మూడేళ్ల క్రితం నాటి వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. 2022 ఆగస్టు 26న బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో అమెరికాకు చెందిన 'పార్లే ఫర్ ది ఓషన్స్' అనే సంస్థతో ఒప్పందం చేసుకుంది. రూ.16 వేల కోట్ల పెట్టుబడితో 20 వేల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని, అందుకోసం విశాఖ పరిసరాల్లో పరిశ్రమ ఏర్పాటుకు భూమిని కేటాయిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. అదేరోజు భీమిలి నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు తీరం పొడవునా రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, వైసీపీ నేతలు, స్వచ్ఛంద సంస్థలు, నేవీ, స్టీల్‌ప్లాంట్, పోర్టు, కోస్ట్‌గార్డు ఉద్యోగులు సహా 22 వేల మందితో మెగా డ్రైవ్ చేపట్టి 75 టన్నుల వ్యర్థాలను సేకరించారు. పార్లే ఫర్ ది ఓషన్స్ సంస్థ తయారుచేసినట్టు పేర్కొంటూ ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారైన వస్తువులతో బీచ్‌రోడ్డులో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలు, అధికారులు నగరానికి తరలిరావడంతో వారందరికీ వసతి, భోజనం, రవాణా కోసం భారీగా ప్రజాధనం వెచ్చించారు. వేదికపైన జగన్మోహన్ రెడ్డి ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారుచేసిన కళ్లద్దాలను పెట్టుకుని ఫొటోలకు పోజులిచ్చారు. ప్రభుత్వ పెద్దల హడావిడి చూసి నగరానికి భారీ ప్రాజెక్టు వచ్చిందని, వేలాది మందికి ఉపాధి అవకాశాలు దొరుకుతాయని సంతోషపడ్డారు. ఒప్పంద పత్రాలు మార్పిడి తర్వాత ప్రాజెక్టు గురించి రాష్ట్ర ప్రభుత్వం మరిచిపోయింది. 'పార్లే ఫర్ ది ఓషన్స్' సంస్థ సీఈఓ సెరిల్‌గోచ్ పలుమార్లు అప్పటి ప్రభుత్వ పెద్దలను కలిసి ప్రాజెక్టుకు భూమి కేటాయించాలని కోరారు. వారి నుంచి కూడా ఎలాంటి స్పందన రాలేదు. ఒప్పంద ప్రతాలు మార్చుకుని మూడేళ్లు అవుతున్నాసరే ఆ ప్రాజెక్టు విషయంలో కనీసం ఒక్క అడుగు కూడా పడకపోవడం విశేషం. ప్రాజెక్టు గురించి జీవీఎంసీ అధికారుల వద్ద ప్రస్తావించగా దాదాపు మూడేళ్లవుతున్నా ఎలాంటి పురోగతి లేనందున ఒప్పందం రద్దయినట్టేనని అభిప్రాయపడుతున్నారు.



మంత్రి రామ్మోహన్‌నాయుడుతో మాట్లాడుతున్న ఎయిర్‌పోర్టు అధికారులు

కేంద్ర మంత్రికి స్వాగతం

గోపాలపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ నుంచి నగరానికి వచ్చిన కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు ఎయిర్‌పోర్టులో శనివారం సాదర స్వాగతం లభించింది. ఉదయం 7.30 గంటలకు ఢిల్లీ నుంచి విశాఖ చేరుకున్న ఆయనకు పలువురు నేతలు, విమానాశ్రయ అధికారులు స్వాగతం పలికారు.

క్యాన్సర్ బాధితుడికి చేయూత

ఆటోనగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి దానబోయి పాలేనికి చెందిన జగ్గమహంతి శ్రీనివాసరావు గొంతు క్యాన్సర్‌తో బాధపడుతుండడంతో శస్త్ర చికిత్స నిమిత్తం శనివారం కూర్మన్నపాలెం శిష్టకరణ అసోసియేషన్ ప్రతినిధులు రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు ఎం.సురేశ్‌కుమార్, ఎస్.శ్రీనివాసరావు,తదితరులు పాల్గొన్నారు.

అశోకచక్రవర్తికి నివాళి

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సామ్రాట్ అశోకచక్రవర్తి జయంతిని పురస్కరించుకుని కూర్మన్నపాలెంలో శనివారం బుద్ధ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సొసైటీ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ కళింగ యుద్ధం తరువాత యుద్ధాలకు స్వస్తి పలికి అశోకచక్రవర్తి బౌద్ధ మతాన్ని స్వీకరించారన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు రమణమూర్తి, పెద్దిరాజు, పైడిరాజు, మూర్తి, స్టాలిన్, ప్రభుదాస్, గణపతి, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

200 మందికి నేత్ర పరీక్షలు

పెందుర్తిరూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వ్యాపారవేత్త డబ్బీరు వెంకటరావు స్మారకార్థం 95వ వార్డు చింతలఅగ్రహారం గవరపాలెం కాలనీ వీరాంజనేయస్వామి ఆలయం వద్ద ఆర్‌ఎంఎస్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొని సుమారు 200 మందికి తనిఖీలు చేసి మందులు పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలకు 60 మందిని ఎంపిక చేశారు. బెహరా విద్యాసంస్థల చైర్మన్ బెహరా భాస్కరరావు, సర్పంచ్ దాడి డి.అప్పలనాయుడు, మాజీ సర్పంచులు పి.వెంకటరమణ, తాతారావు, పి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఎన్.ఎ.డి. జంక్షన్ ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం రజక కాలనీలో రూ.19.85 లక్షలతో చేపడుతున్న సామాజిక భవన నిర్మాణానికి శనివారం కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈ వెంకటలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, సోమేశ్,తదతరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **రాబిన్‌హుడ్** : జగదాంబ, శ్రీలీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● **మ్యాడ్** : జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),

● **పెళ్ళికాని ప్రసాద్** : శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)

● **కోర్ట్** : జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **ఛావా**: శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 16, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 32, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 30, బీరకాయలు 44, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 14, క్యారెట్ 30 దొండకాయలు24, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)8, అల్లం (పాతది)50, బరబాటి 26, ముల్లంగి 24, మునక్కాడలు (కిలో) 30, నిమ్మకాయలు (కిలో) 120, బద్దచిక్కుడు 64, దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 24, క్యాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42 చిలగడదుంపలు 36, కంద 60, దేముడుచిక్కుడు 64, గోరుచిక్కుడు 32, కూరపెండలం 26, బ్రకోలీ 45, నూల్‌కోల్32, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిదగుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	440
విజయనగరం	444
శ్రీకాకుళం	444

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230



గాజువాకలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గణబాబు, తదితరులు

ఆదర్శనీయులు బాబూ జగ్జీవన్‌రామ్

» టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

» పలుచోట్ల ఘనంగా మాజీ ఉప ప్రధాని జయంతి

గాజువాక, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల అభ్యున్నతికి అలుపెరగని పోరాటాలు సాగించిన మహోన్నత వ్యక్తి దివంగత మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గాజువాకలోని పార్టీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పల్లా పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్ నేటి యువతకు ఆదర్శనీయులని, ఆయన అడుగుజాడల్లో అందరూ నడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ 'గాజువాక' సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు శివప్రసాద్, నాగేశ్వరరావు, గోమాడ వాసు, పి.సోమినాయుడు, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్టీల్‌ప్లాంటులో జరిగిన కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు బొండా తౌడన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా, ఉప ప్రధానిగా బాబూ జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు చిరస్మరణీయమని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. లక్ష్మీనగర్‌లో నిర్వహించిన జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాబూజీ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే లక్ష్మీనగర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వైసీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో పలువురు నాయకులుపాల్గొన్నారు.

పెందుర్తి: చినముషిడివాడ శాంతినగర్‌లో నెహ్రూ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావు హాజరై కేక్ కట్ చేయడంతో పాటు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేశారు. నాయకులు దారపు వెంకటరమణ, హనుమంతరావు, లక్ష్మణరావు, కృపారావు, ఏలియా, టి.శ్రీనివాసరావు, టి.ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు. రాంపురంలోని వైసీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పూలమాల వేసి నివాళులర్పించారు.

పెదగంట్యాడ: భారత ఉప ప్రధానిగా డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ పెదగంట్యాడ జంక్షన్‌లో నిర్వహించిన జయంతిలో ఆయన మాట్లాడారు. తాను చేపట్టిన కేంద్ర మంత్రి పదవులకు జగ్జీవన్‌రామ్ వన్నె తేవడంతో పాటు నిమ్నజాతుల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతపూడి వెంకట్రామయ్య, వైసీపీ గాజువాక కన్వీనర్ తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, పల్లా చినతల్లి, అసోసియేషన్ ప్రతినిధులు జి.గురుమూర్తి, ఎం.పరదేశి, గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు. 76వ వార్డులో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, బీజేపీ నేత కరణంరెడ్డి నరసింగరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మల్కాపురం: మల్కాపురం రామ్ రాంజీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో భాగంగా జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌతమ బుద్ధుడు విగ్రహం వద్ద పువ్వులు చల్లి వందనం చేశారు. ప్రకాశనగర్ ఏడుగుళ్ల జంక్షన్ వద్ద అరుంధతి సంఘం ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి గ్రామ పెద్దలు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అలాగే సీపీఐ ఆధ్వర్యంలో, ములగాడలో జాషువా సంఘం ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు పరిధి వుడా ఫేజ్-1లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఈడీ (వర్క్స్) డి.వసంతరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మాటూరి శ్రీనివాసరావు, పెద్దిరాజు, బీపీ స్వామి, పైడిరాజు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: అణగారిన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన ఘనత డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్‌కే దక్కుతుందని బెల్ హెచ్‌పీవీపీ ఈడీ జి.సుబ్రహ్మణ్యం అన్నారు. బెల్ హెచ్‌పీవీపీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు ఎంఎన్ శ్రీనివాసరావు, ఎస్.లీల, కార్మిక నాయకులు కొల్లి దేముడు, బొండా బాబూరావు, పీవీఎన్ రాజు, బి.రవీంద్ర బాబు, టి.భాస్కరరావు, కిరణ్, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే హరిజన జగ్గయ్యపాలెంలో జాంబవ జనజాగృతి సేన ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: జీవీఎంసీ 90వ వార్డు పరిధి లక్ష్మీనగర్ ఎఫ్-బ్లాక్‌లో, బాజీ జంక్షన్ వద్ద గల బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు కార్పొరేటర్ బొమ్మిడి రమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ చేసిన సేవలను కొనియాడారు. టీడీపీ నాయకుడు నరవ అనూష, ఎస్సీ కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వేపగుంట: జీవీఎంసీ 94వ వార్డు పరిధి ఎస్సీ, బీసీ కాలనీలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు పూలమాల వేసి అంజలి ఘటించారు. నాటి నేతలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. టీడీపీ నాయకులు మామిడి కిరణ్, సేనాని దేముడు, అప్పలరాజు, ఆర్.త్రినాథ్, జగదీశ్, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేయకుండా ఆందోళనకారులను అడ్డుకున్న పోలీసులు



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రాజశేఖర్, ఇతర నాయకులు

కాంట్రాక్టు కార్మికుల తొలగింపు చట్ట విరుద్ధం

» కేంద్రం యత్నాలకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలి

» ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్

» రాస్తారోకో చేయకుండా నాయకులు, కార్మికులను అడ్డుకున్న పోలీసులు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల తొలగింపు చట్ట విరుద్ధమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ అన్నారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిరసిస్తూ కాంట్రాక్టు కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో శనివారం రాత్రి రాస్తారోకోకు యత్నించారు. అయితే భారీ ఎత్తున పోలీసులు మోహరించి రహదారిపైకి నాయకులు, కార్మికులు రాకుండా ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్లు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల తొలగింపును తక్షణమే ఆపాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలనీ, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పూర్తి స్థాయిలో వేతనాలను చెల్లించడంతో పాటు బకాయిలను ఇవ్వాలన్నారు. ప్లాంటును ప్రైవేటీకరించేందుకు కేంద్రం చేస్తున్న యత్నాలకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని కోరారు. కార్పొరేటర్ గంగారామ్, సీపీఎం నాయకుడు కేఎం శ్రీనివాస్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలో ఇంత దారుణమైన కార్మికుల తొలగింపును మునుపెన్నడూ చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాటాలను, నాయకులను అణచివేయాలని చూస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కాంట్రాక్టు కార్మికులను ఏ ఒక్కరినీ తొలగించరాదని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని ప్రభుత్వాలు తేలికగా తీసుకుంటే కార్మికుల ఆగ్రహజ్వాలలను చూడాల్సి వస్తుందన్నారు. ఉక్కు పరిరక్షణకు అన్ని పార్టీలు కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, కేఎస్ఎన్ రావు, దొమ్మేటి అప్పారావు, యు.రామస్వామి, బాబూరావు, పి.భాస్కరరావు, నమ్మి సింహాద్రి, అలీషా, నమ్మి రమణ, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. కాగా సౌత్ సబ్ డివిజన్, హార్బర్, వెస్ట్ డివిజన్‌కు సంబంధించిన పోలీసులు అధిక సంఖ్యలో మోహరించారు.

నేడు శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు



పల్లా శ్రీనివాసరావుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకలను ఆదివారం పలు ప్రాంతాల్లో వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీల ప్రతినిధులు ఏరాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా 70వ వార్డు పరిధి డ్రైవర్స్ కాలనీ రామాలయంలో జరిగే పూజలు, కల్యాణోత్సవానికి హాజరు కావాలంటూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు శనివారం ఆలయ కమిటీ ప్రతినిధులు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు కేవిఎస్ శంకరరావు, శ్రీనివాసరావు, పీటీఎల్ మూర్తి, శివ, కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే 87వ వార్డు వడ్లపూడి రామాలయంలో నిర్వహించనున్న సీతారాముల కల్యాణోత్సవానికి సంబంధించి శనివారం పెళ్లిరాట వేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొండా జగన్, బొండా లక్ష్మి, ఎస్ఎస్ విజయరామరాజు, తాతబాబు, గోవింద, మాటూరి రాము, గోవిందరాజు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: శ్రీరామనవమి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించడానికి రామాలయాలను ముస్తాబు చేశారు. గోపాలపట్నం, కొత్తపాలెం, ఎల్లపువానిపాలెం, కోటనరవ ప్రాంతాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించేందుకు ఆలయ కమిటీల ప్రతినిధులు పటిష్ఠ ఏర్పాట్లు చేశారు.

పెందుర్తి: మండలంలోని రామాలయాలను శోభాయమానంగా అలంకరించారు. సీతారాముల విగ్రహాలను అందంగా అలంకరించారు. ఆలయాల వద్ద పెళ్లి పందిర్లు వేశారు. సీతారాముల కల్యాణాన్ని కమనీయంగా జరిపేందుకు సర్వం సిద్ధం చేశారు. కరకవానిపాలెం, సరిపల్లిల్లో పెళ్లిరాటలు వేశారు.

ఈపీఎస్-95 అధిక పింఛన్‌పై చర్చ

అగనంపూడి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి పాత దానబోయినపాలెం రామాలయ ప్రాంగణంలో శనివారం స్థానికంగా గల ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు జి.బోసుబాబు స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగులకు కల్పించిన ఆరోగ్య బీమా పాలసీ ప్రయోజనాలను వివరించారు. ఈపీఎస్-95 అధిక పింఛన్‌పై సదీర్ఘంగా చర్చించారు. అసోసియేషన్ సభ్యుల ప్రయోజనాల కోసం చేపడుతున్న కార్యక్రమాల గురించి తెలియజేశారు. అనంతరం వయోవృద్ధులకు గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు గుదే సుశీల గజేంద్రరరావు, బి.భాస్కరరాజు, బి.కాళిదాసు, పోలిరెడ్డి, విందుల వరహాలు, తదితరులు పాల్గొన్నారు.

అద్దెకు స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్

» ఇబ్బందులు పడుతున్న పలువురు ఉక్కు ఉద్యోగులు

» టౌన్ అడ్మిన్ విభాగం అధికారులకు ఫిర్యాదు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు నివాసం ఉండాల్సిన క్వార్టర్స్‌లో ఇతరులు తిష్ఠ వేస్తున్నారు. చాలామంది ఉద్యోగులు తాము నివాసం ఉంటామని క్వార్టర్స్‌ను యాజమాన్యం వద్ద నుంచి తీసుకుని బయట వ్యక్తులకు అద్దెకు ఇస్తున్నారు. టౌన్‌షిప్‌లోని 12 క్వార్టర్స్‌లో సుమారు పది వేల ఇళ్లున్నాయి. ఇందులో ఉక్కు ఉద్యోగులు మాత్రమే నివాసం ఉండాలి. అయితే క్వార్టర్స్ తీసుకున్న వారికి హెచ్‌ఆర్‌ఏ రాదు. ఇటీవల స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం హెచ్‌ఆర్‌ఏను రద్దు చేసింది. దీంతో క్వార్టర్స్ ఖాళీ చేసినప్పటికీ హెచ్‌ఆర్‌ఏ రాదని భావించిన పలువురు ఉద్యోగులు తమ క్వార్టర్స్‌ను ఖాళీ చేసి తమ సొంతిళ్లకు వెళ్లిపోయినప్పటికీ క్వార్టర్స్‌ను మాత్రం బయట వ్యక్తులకు అద్దెకు ఇస్తున్నారు. ఇక్కడే అసలు సమస్య వస్తుంది. అద్దెకు ఉన్నవారు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని, చుట్టుపక్కల వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొంటున్నారు. ఈ మేరకు శనివారం కొంతమంది ఉద్యోగులు టౌన్ అడ్మిన్ విభాగం అధికారులకు ఫిర్యాదు చేశారు. తాము నివాసం ఉంటున్న చుట్టుపక్కల క్వార్టర్స్‌లో బయట వ్యక్తులు నివాసం ఉంటున్నారని, వారు నిత్యం ఏదో ఒక విధంగా గొడవలకు దిగుతున్నారని, మద్యం తాగి ఇబ్బందికరంగా ప్రవర్తిస్తున్నారని వివరించారు. అయితే ఇప్పటికే చాలాసార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఈసారి చర్యలు చేపట్టకపోతే మాత్రం టౌన్ అడ్మిన్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని వారు తెలిపారు.

దువ్వాడ రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీఈ సాయిరాజు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం సీనియర్ డివిజనల్ ఇంజనీర్ బి.సాయిరాజు, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ శ్రీనివాసరావులు పరిశీలించారు. పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని, తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. అమృత భారత్ స్టేషన్‌గా రూపుదిద్దుకుంటున్న తరుణంలో ప్రయాణికుల సౌకర్యార్థం 12 మీటర్ల ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, ప్లాట్‌ఫారాల అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కరణంరెడ్డి నరసింగరావు

నేడు బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

» ప్రతి పోలింగ్ బూత్‌లో పార్టీ జెండా ఎగురవేస్తాం

» గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం వాడవాడలా ఘనంగా నిర్వహిస్తామని గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. గాజువాకలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తామన్నారు. అదేవిధంగా ఈ నెల 12వ తేదీన చేపట్టనున్న హనుమాన్ శోభాయాత్రలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా కోరారు. దేశంలో ప్రతిఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.శంకరరావు, డి.కృష్ణంరాజు, నాగేశ్వరరావు, సొంబాబు, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమ్మెకు మద్దతు ఇవ్వాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని, తొలగించిన వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16 నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మెకు మద్దతు ఇవ్వాలని కోరుతూ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులకు కాంట్రాక్టు కార్మికులు విజ్ఞప్తి చేశారు. ప్లాంటులో ఉద్యోగ సంఘాలు, కాంట్రాక్టు కార్మికులు ఏ ఒక్కరు సమ్మె చేసినా మిగతా వారు సంపూర్ణ మద్దతివ్వడం ఆనవాయితీ. అయితే ఈసారి కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మెకు దిగుతున్నందున సమ్మెకు మద్దతివ్వాలని నాయకులు కోరారు.

పెంటమాంబ ఉత్సవాలను విజయవంతం చేయాలి

పెదగంట్యాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నిర్వాసిత కాలనీల ప్రజల ఆరాధ్య దేవత శ్రీపెంటమాంబ వార్షికోత్సవాలు విజయవంతం చేసేందుకు అన్ని వర్గాల వారు సహకరించవలసిందిగా ఉత్సవ నిర్వహణా కమిటీ నాయకులు కోరారు. ఆలయ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కమిటీ నాయకుడు గొందేశి మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఈ నెల రెండున ప్రారంభమైన ఉత్సవాలు 14న అనుపోత్సవంతో ముగుస్తాయన్నారు. ముగింపు రోజున భారీ ఊరేగింపు, పరసతో పాటు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, కళారూపాలు, సాంఘిక, పౌరాణిక నాటకాలను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పులి వెంకటరమణారెడ్డి, జి.సత్యారావు, జి.అప్పలరెడ్డి, వై.శ్రీనివాసరావు, జి.పైడిరాజు, ఎం.రమణ, కుంచారావు, శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

గిరినాగుల హల్‌చల్



తూర్పుకనుమల్లో అధికంగా సంచారం

(చోడవరం-ఆంధ్రజ్యోతి)

గిరినాగు... దీనినే కింగ్ కోబ్రాగా పిలుస్తుంటారు. ఇది 15 నుంచి 18 అడుగుల పొడవు ఉండి చూడడానికి భయంగొలిపేలా ఉంటుంది. ఇటీవల ఈ గిరినాగులు అనకాపల్లి జిల్లా చీడికాడ, దేవరాపల్లి, మాడుగుల మండలాల్లో తరచుగా కనిపిస్తున్నాయి. ప్రపంచంలోనే విషపూరిత సర్పాల్లో ఇది ఒకటి. అంతరించిపోతున్న జాతుల్లో అరుదైన ఈ గిరినాగును ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించి, కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడం విశేషం. ఈ గిరినాగుల వల్ల మనుషులకు ఇంతవరకూ ఎక్కడా ప్రాణహాని జరిగిన సంఘటనలు లేవు.

- అంతరించిపోతున్న జాతుల్లో అరుదైనది
- వీటి సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- ఇవి ఉన్నచోట మిగతా విషపూరిత పాములు కనుమరుగు
- రైతులకు మేలు చేసే కింగ్ కోబ్రాల పట్ల అవగాహన అవసరం అంటున్న వన్యప్రాణి సంరక్షకులు


గిరినాగును పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న మూర్తి కంటిమహంతి

ప్రపంచంలో అరుదైన జాతి కింగ్ కోబ్రా (ఓఫియోఫేగస్ హనా) తూర్పుకనుమల్లో... అది కూడా ఎక్కువగా అనకాపల్లి జిల్లా దేవరాపల్లి, మాడుగుల, చీడికాడ మండలాలతో పాటు అల్లూరి జిల్లా జి.మాడుగుల, పాడేరు, విజయనగరం జిల్లా వేపాడ, ఎస్.కోట ప్రాంతాల్లో ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకాకుళం, ఇచ్చాపురం అటవీ ప్రాంతంలో కూడా వీటి ఉనికి ఉంది. అనకాపల్లి జిల్లాలో గిరినాగుగా దీనిని పిలిస్తే, శ్రీకాకుళం ప్రాంతంలో బైరాగినాగుగా పిలుస్తారు. తూర్పుకనుమల్లో కనిపించే గిరినాగులన్నీ ఒకే జాతికి చెందిన రకం. ఇది ప్రాంతాన్ని బట్టి, సీజన్‌ను బట్టి తినే ఆహారాన్ని బట్టి కొద్దిగా రంగు మారుతుంటుంది. తప్పితే ఎక్కువగా లైట్ గ్రీన్, తెల్లని చారలతో నల్లని రంగులో ఉంటుంది. ఇది పడగ విప్పే తీరు నిటారుగా ఉండి నలుపలకలా ఉంటుంది. సాధారణ నాగుపాము పడగ మాదిరిగా కాకుండా కొంచెం వీ షేప్‌లో ఉంటుంది. సాధారణ నాగుపాముకు దీనికి తేడా సులభంగానే గమనించవచ్చు. గుడ్లు పెట్టడానికి ప్రత్యేకంగా గూడు నిర్మించుకునే పాము ప్రపంచంలో ఇదొక్కటే అని చెబుతారు. ఆడ కింగ్ కోబ్రా ఎక్కువగా సురక్షితమైన వెదురుపొదలు గుబురుగా ఉన్న ప్రదేశాలను ఎంపిక చేసుకుని ఎండిపోయిన ఆకులతో గూడు తయారుచేసి 30 నుంచి 40 వరకూ గుడ్లు పెట్టి, అవి పిల్లలు అయ్యేంత వరకూ ఆహారం తినకుండా అక్కడే ఉండి కాపలా కాస్తుంటుంది. అవి పొదిగి పిల్లలైన తరువాత అక్కడ నుంచి తన ఆహారం వేటకు బయలుదేరి వెళ్లిపోతుంది.

మూడు మండలాల్లో సంచారం

చీడికాడ, దేవరాపల్లి, మాడుగుల మండలాల్లోని పంట పొలాలు, పామాయిల్ తోటల్లో గిరినాగులు సంచరించడం, స్థానికుల సమాచారంతో వాటిని అటవీ శాఖ ఆధ్వర్యంలో తూర్పుకనుమల వన్యప్రాణి సంరక్షణ సంస్థ సభ్యులు పట్టుకుని సమీపంలోని అడవుల్లో సురక్షితంగా విడిచిపెడుతున్న ఘటనలు ఇటీవల ఎక్కువయ్యాయి. చూడడానికి భయంకరంగా ఉండే ఈ గిరి నాగులు వాటి ప్రాణాలకు ముప్పు కలిగిస్తే తప్ప, సాధ్యమైనంత వరకు మనుషులను తప్పించుకుని పోయేందుకే ప్రయత్నిస్తాయని వన్యప్రాణి సంరక్షకులు చెబుతున్నారు. ఎక్కువగా పాములను తిని బతికే ఈ గిరినాగు, పరోక్షంగా రైతులకు సైతం మేలు చేస్తున్నాయని అంటున్నారు. అంతరించిపోతున్న ఈ గిరినాగులను కాపాడేందుకు రాష్ట్ర అటవీశాఖ 2016 నుంచి తూర్పు కనుమల వన్యప్రాణి సంరక్షణ సంస్థ (ఈజీడబ్ల్యూఎస్) సంయుక్తంగా తూర్పుకనుమల ప్రాంతంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నది.

ఇవి జత కట్టే సమయం

కింగ్ కోబ్రాలు మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎక్కువగా జత కడుతుంటాయి. ఆడ, మగ కోబ్రాలు కలిసే సమయం కావడంతో ఇటీవల కాలంలో వీటి కదలికలు ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉంటున్నాయని అంటున్నారు. గత ఏడాది దేవరాపల్లి మండలంలోని తారువలో ఒకేసారి నాలుగు కింగ్ కోబ్రాలు కలుసుకునేందుకు రావడం, అప్పట్లో స్థానికులు వాటిని చూసి భయాందోళనకు గురై అటవీశాఖకు సమాచారం ఇవ్వడం, వాటిని సిబ్బంది పట్టుకోవడం సంచలనంగా మారింది.


గిరినాగు పిల్లలు

గిరినాగు వల్ల రైతులకు ప్రయోజనమే..



సాధారణంగా కనిపించే నాగుపాము, పొడపాము, కట్లపాము మనుషులను కరవడం వల్ల చనిపోయిన ఘటనలు ఎక్కువగా ఉంటాయి. అటువంటి ప్రమాదకర పాములనే ఈ గిరినాగు తింటుంది. అటువంటి పాములను తిని వాటి సంతతి పెరగకుండా ఇది పరోక్షంగా రైతులకు మేలు చేస్తుంది. ఈ గిరినాగు ఉన్న ప్రాంతంలో దాని భయంతో ఇతర పాములు కనిపించకుండా పోతాయి. తూర్పుకనుమల్లో ఇది ఎక్కువగా కనిపించడానికి కారణం ఈ ప్రాంతంలో ఇతర రకాల పాములు ఎక్కువగా ఉండడమే. దీనివల్ల ఉపయోగమే ఎక్కువగా ఉంది. ఇది కనిపిస్తే మాకు లేదా, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇస్తే మేం వచ్చి దానిని పట్టుకుని కాపాడుతాం. ఈ గిరినాగు సంరక్షణకు మేం కృషిచేస్తున్నాం. గిరిజన గ్రామాల్లోని గిరిజనులకు గిరినాగుపై ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, అటవీ శాఖ అధికారులకు కూడా అవగాహన కల్పిస్తున్నాం. స్థానిక యువకులకు కూడా దీనిని పట్టుకోవడం, సురక్షితంగా అడవిలో విడిచిపెట్టడం వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నాం. అలాగే ప్రధాన రహదారులు పక్కన గిరినాగు గురించిన ఫొటోలతో బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు మా వలంటీర్ల ఫోన్ నంబర్లు కూడా ఇస్తున్నాం. ఈ ప్రచారం వల్లే గిరినాగుల సమాచారంపై ఎక్కువగా మాకు ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. 2017 నుంచి ఇప్పటి వరకూ ఉత్తరాంధ్ర ప్రాంతంలో 150కి పైగా గిరినాగులను పట్టుకుని అడవిలో విడిచిపెట్టాం.

- మూర్తి కంటిమహంతి, తూర్పుకనుమల సంరక్షణ సంస్థ ఫౌండర్

గిరినాగులను చంపడం నేరం



గిరినాగులను చంపడం నేరం. వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద నాన్‌బెయిలబుల్ కేసు. 1972 వన్యప్రాణుల సంరక్షణ చట్టం షెడ్యూల్ ఒకటి కింద ఈ గిరినాగును కొట్టి చంపడం లేదా దీనిని గాయపరచడం కూడా నేరమే. అటవీ శాఖ చట్టంలో పెద్దపులికి ఎంత రక్షణ ఉందో, ఈ గిరినాగుకు కూడా అంతే రక్షణ ఉంది. అటవీ శాఖ అనుమతి లేకుండా దీనిని ఎవరూ పట్టుకునే ప్రయత్నం చేయకూడదు. కనిపిస్తే అటవీ అధికారులకు సమాచారం ఇస్తే, వారు ఈజీడబ్ల్యూఎస్ సంస్థ వలంటీర్లకు సమాచారం ఇస్తే వారు వచ్చి, ఈ గిరినాగును పట్టుకుని సమీపంలో అడవుల్లో విడిచిపెడతారు. గిరినాగులు కనిపిస్తే 8639124883, 6301095968 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలి.

- పి.వి.రవివర్మ, అటవీ శాఖ రేంజి అధికారి, చోడవరం

'అసోసియేషన్ సభ్యులు తప్పు చేస్తే విచారణ జరపాలి'

విశాఖపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీలో భాగంగా కొందరు అభ్యర్థులు పెట్టిన ఫేక్ సర్టిఫికెట్లతో తమకు ఎటువంటి సంబంధం లేదని ఏపీ నర్సింగ్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ టి.గంగాభవానీ ఒక ప్రకటనలో తెలిపారు. 'నర్సు పోస్టులకు ఫేక్ సర్టిఫికెట్లు' శీర్షికతో శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. స్టాఫ్ నర్సు పోస్టులకు దరఖాస్తు చేసిన వారిలో కొందరు కరోనా సమయంలో పనిచేసినట్టు తప్పుడు సర్టిఫికెట్లను జత చేశారు. అయితే నర్సింగ్ అసోసియేషన్ సభ్యులెవరూ ఇటువంటి సర్టిఫికెట్లు ఇచ్చే ప్రయత్నం చేయలేదని ఆమె స్పష్టం చేశారు. ఈ సర్టిఫికెట్లన్నీ మెడికల్ కాలేజీ కార్యాలయానికి సంబంధించిన క్లర్కులు మాత్రమే అందించారని, తమపై కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసోసియేషన్ సభ్యులెవరైనా నిజంగా తప్పు చేసినట్టయితే అటువంటి వారిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. తప్పు చేసినట్టు నిర్ధారణ అయితే తామే చర్యలు తీసుకుంటామని, ఈ మేరకు ఆర్డీని కూడా కోరినట్టు పేర్కొన్నారు.

జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు యువత కృషిచేయాలి

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్


జడ్పీలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నమస్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్


బీచ్ రోడ్డులోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

బీచ్ రోడ్డు,ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) : బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా శనివారం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని ఆయన విగ్రహానికి కలెక్టర్‌తో పాటు పలువురు అధికారులు, నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం, సామాజిక సమానత్వం, చైతన్యం కోసం పోరాడిన ఆదర్శ నేత బాబూ జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. కులరహిత సమాజం కోసం తన జీవితాంతం కృషి చేసిన బడుగు, బలహీనవర్గాల నేత అన్నారు. 40 ఏళ్లపాటు రాజకీయ జీవితం కొనసాగించడమే కాకుండా, ఉప ప్రధానితో మరెన్నో విశిష్ట పదవులు చేపట్టి బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన గొప్ప వ్యక్తి అన్నారు. భారతీయ జనతా పార్టీ నగర అధ్యక్షుడు పరశురామ్ రాజు మాట్లాడుతూ.. బాబూ జగ్జీవన్‌రామ్ విద్యార్థి దశ నుంచే కుల వివక్షపై పోరాటాలు చేశారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం, ఆధునిక భారత దేశ నిర్మాణంలోనూ స్ఫూర్తివంతమైన సేవలు అందించారని కొనియాడారు. దళితుల అభ్యున్నతి కోసం, సామాజిక సమానత్వం కోసం పోరాటాలు చేసి విజయాలు సాధించారని పేర్కొన్నారు. భారతదేశంలో హరిత విప్లవం, భారత వ్యవసాయాన్ని ఆధునికీకరించడంలో బాబూ జగజ్జీవన్ రామ్ పాత్ర ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలు జగ్జీవన్‌రామ్ చలవే: కలెక్టర్

మహారాణిపేట: సామాజిక న్యాయమే ఊపిరిగా, అణగారిన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా మహోన్నతమైన సేవలు అందించిన సంస్కరణల యోధుడు, బడుగుల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ శ్లాఘించారు. శనివారం జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన జయంతి వేడుకలలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంటరానితనానికి గురైన దళిత ప్రజలను సంఘటితం చేసి ఓ కార్యకర్తగా, ప్రజా జీవితంలో అడుగు పెట్టారని అన్నారు. సామాజిక న్యాయానికి కృషి చేస్తూ, తొలి కార్మిక సంక్షేమ శాఖ మంత్రిగా ఆయన రూపొందించిన చట్టాలు ఇప్పటికీ అమలులో ఉన్నాయని గుర్తుచేశారు. కార్మిక సంక్షేమానికి ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. శ్రమతత్వం తో ఉప ప్రధాన మంత్రి స్థాయికి ఎదిగి, దేశానికి ఎన్నో మహోన్నతమైన సేవలు అందించారని పేర్కొన్నారు. దేశ అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి ఎన్నటికీ నిలిచి ఉంటుందని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, జడ్పీ సీఈవో నారాయణ మూర్తి, అధికారులు సత్యపద్మ, బి కళ్యాణరావు, సుజాత , వెంకటరావు, సుబ్బారాయుడు, చొక్కాకుల వెంకటరావు , పలువురు నాయకులు పాల్గొన్నారు.

సేవలకు సిద్ధమవుతున్న డాక్‌యార్డు వంతెన

- నిర్మాణ పనులు దాదాపు పూర్తి
- వాహనాల రాకపోకలకు త్వరలో అనుమతి
- నేవీకి ఇస్తారన్నది వదంతులే
- పోర్టు అధికారుల స్పష్టీకరణ


తుది దశలో ఉన్న డాక్‌యార్డు సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన నిర్మాణం

మల్కాపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): డాక్‌యార్డు సమీపంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. త్వరలోనే ఈ వంతెనపై వాహనాల రాకపోకలు ప్రారంభం కానున్నాయి. ఆ దిశగా పోర్టు అధికారులు తుది దశ పనులను వేగవంతం చేస్తున్నారు. వంతెన నిర్మాణ పురోగతిపై ప్రజలు కొద్ది రోజులుగా ఆరా తీస్తున్నారు. ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తున్నవారు తుదిదశకు చేరుకున్న వంతెన పనులు చూసి సంతోషిస్తున్నారు. సామాజిక సేవలో భాగంగా ప్రజల కోసం పోర్టు ఈ వంతెనను నిర్మించింది. నేవీకి అప్పగిస్తారన్న వదంతులు ఓవైపు ప్రచారంలో ఉండగా, పోర్టు అధికారులు కొట్టిపారేస్తున్నారు. ఈ వంతెన ప్రజల కోసమేనని స్పష్టం చేస్తున్నారు. పాత వంతెనను పూర్తిగా నేలమట్టం చేసి సముద్రంలో నుంచి స్తంభాలు (పిల్లర్లు) వేసి పటిష్టంగా నిర్మించినట్లు తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల వంతెన నిర్మాణం కొంత ఆలస్యమైంది. కొత్త వంతెన పైనుంచి అక్కడ పనిచేసేవారి చిన్న చిన్న వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు, ఫుట్‌పాత్‌లు కొంతవరకు నిర్మించారు. మిగతా పనులు తొందరగా పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆగస్టు నాటికి ఈ వంతెన ప్రజలకు అంకితం ఇవ్వాలని భావించినా, అంతకంటే ముందుగానే ఇచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. వందేళ్ల వరకు ఈ వంతెనకు ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు.

ఏయూలో స్పెషల్ పరీక్షల నిర్వహణపై విచారణ

- ఉన్నత విద్యా మండలి ఆదేశం
- రెక్టార్ ప్రొఫెసర్ కిశోర్‌బాబు చైర్మన్‌గా కమిటీ ఏర్పాటు

విశాఖపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఏయూలో మాజీ ఉన్నతాధికారి స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించిన వ్యవహారంపై ఉన్నత విద్యా మండలి విచారణకు ఆదేశించింది. ఈ పరీక్షల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నిర్వహణపై గత నెలలో 'ఏయూ మాజీ ఉన్నతాధికారి ఇష్టారాజ్యం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీనిపై స్పందించిన ఉన్నత విద్యా మండలి విచారణ చేయాల్సిందిగా ఏయూ అధికారులను ఆదేశించింది. ఈ మేరకు విచారణకు కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి రెక్టార్ ప్రొఫెసర్ కిశోర్‌బాబు చైర్మన్‌గా వ్యవహరిస్తుండగా, కన్వీనర్‌గా అకడమిక్ అఫైర్ డీన్ ప్రొఫెసర్ ఈశ్వర్‌కుమార్‌ను నియమించారు. సభ్యులుగా ప్రొఫెసర్ సునీత, సీతామాణిక్యం, భాస్కరరెడ్డి ఉన్నారు. వీరు 15 రోజుల్లోగా విచారణ జరిపి నివేదిక సమర్పించనున్నారు.

క్రైం... crime news

మహిళ హత్య కేసు..

పోలీసుల అదుపులో మరో ఇద్దరు నిందితులు

ఆరిలోవ (విశాఖపట్నం), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : గత నెలలో ఒక యువతిని హత్య చేసి పార్వతీపురం జిల్లా సాలూరుకు సమీపంలో గల చీపురువలస వద్ద జీడితోటలో ఆత్మహత్య చేసుకున్నట్టు చిత్రీకరించిన కేసులో మరో ఇద్దరు నిందితులను ఆరిలోవ పోలీసులు శనివార అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

గత మూడు నెలల నుంచి రాము అనే వ్యక్తి ఆరిలోవ వద్ద పైనాపిల్ కాలనీలో గల హుద్‌హుద్ ఇళ్ల కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఆయనకు చీపురువలసకు చెందిన ఐశ్వర్యతో పరిచయమైంది. ఈ క్రమంలో వీరిద్దరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ నేపథ్యంలో తనను పెళ్లి చేసుకోమంటూ ఐశ్వర్య డిమాండ్ చేయగా, రాము తోసిపుచ్చాడు. తనకు ఇది వరకే వివాహం జరిగిందని, పెళ్లి చేసుకోనని తెగేసి చెప్పాడు. ఈ విషయమై వీరిద్దరి మధ్య వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో ఐశ్వర్యపై రాము దాడి చేసి గట్టిగా కొట్టడంతో ఆమె చనిపోయింది.

దీంతో రాము వెంటనే ఆమె మృతదేహాన్ని ఆ రాత్రి పార్వతీపురం జిల్లా చీపురువలస సమీపంలో గల జీడితోటలోకి తీసుకెళ్లి ఆమె ఉరి వేసుకొన్నట్టుగా చెట్టు కొమ్మకు వేలాడదీశాడు. చీపురువలస ఐశ్వర్య సొంతూరు కావడంతో అక్కడే ఆమె ఆత్మహత్య చేసుకొనేలా అందరూ భావిస్తారని రాము అనుకున్నాడు. అయితే ఈ కేసును దర్యాప్తు చేపట్టిన అక్కడి పోలీసులు ఐశ్వర్యది హత్యగా నిర్ధారించి, కేసులో ప్రధాన నిందితుడు రామును అరెస్టు చేశారు. అనంతరం ఆరిలోవ పోలీసులకు కేసు వివరాలు అందించారు. ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు స్థానికంగా దర్యాప్తు చేపట్టి ఈ కేసులో రాముకు సహకరించిన పైనాపిల్ కాలనీకి చెందిన ఎల్లారావు అలియాస్ సాయి (27), విశాఖ నగరంలోని తాటిచెట్లపాలేనికి చెందిన సీహెచ్ శంకరావును అదుపులోకి తీసుకున్నారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య


మృతి చెందిన స్నేహల్ (ఫైల్‌ఫొటో)

సీతంపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న స్నేహల్ (20) అనే విద్యార్థి అక్కయ్యపాలెం వద్ద జగన్నాథపురంలోని తమ ఇంటిలో సీలింగ్ ఫ్యాన్‌కి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జగన్నాథపురానికి చెందిన బీవీఎస్ఎన్ మూర్తి కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. ఆయన ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. అతని చిన్న కుమారుడు స్నేహల్ ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. అయితే ఏం జరిగిందో.. ఏమో.. శనివారం ఉదయం ఎవరూ లేని సమయంలో ఇంటి లోపల గెడ పెట్టి ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి మృతి చెందిన విద్యార్థి తండ్రి మూర్తికి సమాచారం అందించారు. హుటాహుటిన ఇంటికి వచ్చి చూసేసరికి కుమారుడు స్నేహల్ మృతి చెంది ఉన్నాడు. దీంతో నాలుగో పట్టణ పోలీసులకు మూర్తి ఫిర్యాదు చేశారు. సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు. సంఘటన స్థలానికి వచ్చిన హెడ్‌కానిస్టేబుల్ గణేష్ కేసు విచారణ చేపట్టారు. ప్రేమ వ్యవహారంతోనే ఆ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

ఆనందపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం పంచాయతీకి చెందిన యువకుడు శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ చింతా వాసునాయుడు తెలిపిన వివరాలు ప్రకారం.. కెల్ల అచ్చిబాబు (32) స్థానిక సర్పంచ్ చందక లక్ష్మి ఇంట్లో 15 ఏళ్లుగా పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. శుక్రవారం రాత్రి సర్పంచ్ గెస్టుహౌస్ సమీపంలో పురుగుల మందు తాగి మృతి చెందాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. స్థానికులు శనివారం ఉదయం మృతదేహాన్ని చూసి అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గెస్టు హౌస్‌లో ఉన్న సిసి ఫుటేజ్‌ను పరిశీలించగా అందులో పురుగుల మందు తాగినట్టు ఉండడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి సూరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు.

దేశాభివృద్ధిలో సముద్ర రవాణా రంగం కీలకం

- విశాఖపట్నం పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ అంగముత్తు


సముద్ర యాత్రికుల త్యాగాల చిహ్నం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ అంగముత్తు

విశాఖపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో నౌకాయాన, సముద్ర రవాణా రంగాలు కీలకమని విశాఖపట్నం పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అన్నారు. 62వ జాతీయ సముద్ర దినోత్సవాలను శనివారం పోర్టు అథారిటీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోర్టు టగ్‌పోటిల్లా ఇచ్చిన గౌరవ వందనాన్ని ఆయన స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోర్టు సామర్థ్యాన్ని పెంచేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేశ్‌కుమార్ దూబే, ఇండియన్ కోస్ట్‌గార్డు డీఐజీ రాజేశ్ మిట్టల్, దుర్గాప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

సిరి అట్లేయర్ బోటిక్ షోరూమ్ ప్రారంభం


చీరలను పరిశీలిస్తున్న డాక్టర్ సుజాత, ఇతర ప్రముఖులు

మహారాణిపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అత్యున్నతమైన డిజైన్లు, అన్ని రకాల చీరలతో సిరి అట్లేయర్ బోటిక్ శనివారం ప్రారంభమైంది. ఫేకర్ లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన సిరి అట్లేయర్ షోరూమ్‌ను ప్రముఖ గుండె వైద్య నిపుణురాలు, ఇండస్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ వి.సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూమ్ అధినేత్రి శిరీషా మాట్లాడుతూ చిన్ననాటి కలగా సిరి అట్లేయర్ షోరూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. గత 20 సంవత్సరాల అనుభవంతో అన్ని రకాల వీవర్, ఆర్గన్ సాజ్, పొందూరు, మంగళగిరి, చందేరి కాటన్ చీరలను అందరికీ నచ్చేలా డిజైన్ చేయించినట్లు పేర్కొన్నారు. మగ్గం మిషన్ వర్కుతో కంచి, వివిధ రకాల బోర్డర్‌లను మార్చటం, కాంబినేషన్లు, అత్యున్నత డిజైన్‌లను అందించనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు షోరూమ్‌ను సందర్శించారు.